# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి 2026

వెల : రూ. 10.00



## నవంబరు 8 నుండి 16 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన
## శ్రీ సద్గురుదేవుల 37 వ పుణ్యారాధన దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 5
పేజీలు 44
జనవరి 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ........................... ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ .................. 7
ఏమి సేతురా బాబు!...................................... 8
మకర సంక్రాంతి ..................................................9
ఉపపర్వణుడు ............. ................................12
మాతాజీ బోధ .................................. ............14
భగవద్గీత సాధన దీపిక ..................................16
స్వామి దయానంద మహారాజ్.... ..................18
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 20
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 22
నారద భక్తి సూత్రములు ................ ...............24
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....26
వర్క్ ఫ్రమ్ ఓం ...... .........................................27
శ్రీ బాబూజీతో నా ప్రయాణం ....................29
నిరీక్షణ ...........................................................31
శ్రీ గురుగీత ........................................... .........33
గురుకృప ......................................... ..............35
శ్రీబాబూజీతో అనుభవాలు ................. 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



8. నీవు పోయినాక పెట్టు పిండాలు
మరి పండాల బ్రతుకుగొరకె మేను
యున్ననాడె ముక్తిమార్గమరయరా
కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥

తా: ఒక వ్యక్తి మరణించిన తరువాత అతని కుటుంబ సభ్యులు పెట్టే పిండాలు అతనిని ఏమాత్రం ఉద్ధరించలేవు. అవి కేవలం ఆ పురోహితులకు బ్రతుకుతెరువును మాత్రం కల్పిస్తాయి. '**శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం**' అన్నారు. అందుకే ఈ శరీరంతో బ్రతికి ఉండగానే ముక్తిని పొందే మార్గాన్ని గురువుల ద్వారా తెలుసుకొని, ఆ మార్గంలో పయనించి ముక్తిని పొందాలి.

1) శ్రీబాబూజీ పసిబిడ్డను ఎందుకు ఏడవమన్నారు?
2) బ్రహ్మదేవుడు నారదుని ఎందుకు శపించాడు?
3) ఏ జ్ఞానమూ లేకున్నా పరవశాన్ని కలిగించేది ఏది?
4) రాత్రంతా తెడ్డు వేసినా పడవ ఎందుకు ముందుకు కదలలేదు?
5) నారాయణమూర్తి గజేంద్రునికి మోక్షమిచ్చాడా? లేక మొసలికి మోక్షమిచ్చాడా?
6) భగవానుని దివ్యజ్యోతిని ఎక్కడ దర్శించవచ్చు?
7) ప్రజ్ఞావాదులు అంటే ఎవరు?
8) శ్రీబాబూజీ మనను ఎటువంటి ఆవుతో పోల్చారు?
9) మనలో కన్ఫూజన్ ఎప్పుడు పోతుంది?
10) పరమాత్మ రాక్షసులను కూడా తనలో ఎందుకు జేర్చుకున్నాడు?

*సమాధానాలు లోపలి పేజీలలో..........................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

23-10-1981

ఈరోజు సాయంత్రం ప్రార్థన అయిన తర్వాత శ్రీబాబు ప్రసంగించారు. 'కృష్ణనామము చాలా పవిత్రమైనది. దానికి గల శక్తి దేనికి ఉంది? కృష్ణుడు నీలమేఘ శ్యాముడు, ఘనశ్యాముడు. మేఘము చల్లగా ఉండి క్షేత్రములపై వర్షించి క్షేత్రములోని బీజములను అంకురింపజేస్తుంది. అవి మొలకెత్తకపోయే అవకాశం ఉంది. ఘనశ్యాముడు కురిపించే కిరణాలు చల్లగా మానవులపై ప్రసరించి భక్తి బీజాలని మొలకెత్తింపజేస్తాయి. భక్తి ద్వారా మోక్షాన్ని సాధించవచ్చు. రాధ అందువలననే ఆ కృష్ణ నామమునే తన హృదయక్షేత్రంలో నిలుపుకొంది. ఇంక ఆమెకి కావలసినది ఏముంది?'



ప్రార్థన ప్రారంభం కాకముందు శ్రీ బాబు దర్శనార్థం సాంకేతిక విద్యాశాఖామంత్రిగారు వచ్చారు. ఆ సందర్భాన్ని గుర్తుచేస్తూ, డాక్టరు రాజుగారిని నేను ఏమి బోధ చేశానో చెప్పు అన్నారు శ్రీ బాబు. డాక్టరు రాజు చెప్పలేకపోయాడు. శ్రీబాబు మాట్లాడుతూ, ఎవరైనా చెప్పవచ్చు అన్నారు. ఎవరూ మాట్లాడలేదు.

శ్రీ బాబు తిరిగి మాట్లాడుతూ 'నేను ఎక్కడ ఉంటే అక్కడ తయారవుతారు. ఈగలు ముసిరినట్లు ముసురుతారు. ఈగే నయం పదార్థాన్ని గ్రహిస్తుంది. మీరేమీ జ్ఞాపకం ఉంచుకోరు. ఏం లాభం? నా ప్రక్కనే ఉండి నేను చెప్పేది జ్ఞాపకం వుంచుకోలేని వారు ఇంక ఏమి ఆచరణలో పెడతారు? ఏమి సాధన చేస్తారు? అంటే మనస్సు నిలవలేదన్నమాట. మనస్సు నిలిస్తే ఎందుకు మరచిపోతారు! ఇలాగేనా చేయవలసింది? గురుదేవుడి నోటివెంట ఏదివస్తే దానిని సంగ్రహించి విచారణచేసి మననం చేసుకొని దానిలో ఆచరించవలసిన వాటిని ఆచరించాలి. అదీ సాధన అంటే' అన్నారు.

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ 'పోనీ మీ మనస్సు నాలోనే నిలిచిపోయింది. ఏమి జరిగిందో తెలియదు అని మీరు సమాధానం చెపుదామనుకుంటున్నారేమో. మొదట్లో మనస్సు నిలవకముందు ఏం జరిగిందో నేను ఏమి చెప్పానో చెప్పండి చూద్దాం' అన్నారు.

రామతీర్థుడు ఒకసారి గీతను గూర్చి ప్రసంగిస్తున్నారు. శిష్యులంతా వింటున్నారు. అందులో ఒక శిష్యుడు బోధని వింటూ, అలాగే ఆ బోధలో లయించిపోయాడు. అతని కండ్లవెంబడి ఆనందాశ్రుధారలు కారుతూనే ఉన్నాయి. అదీ మనస్సు నిలిచే స్థితి అంటే. మనస్సు నిలిచేవరకే బోధా శ్రవణము, ఆ శిష్యునికి కూడా గురువుగారు చెప్పే గీతాబోధ మనస్సు నిలిచేవరకే వినపడింది. ఆ తర్వాత ఏమి జరిగిందో ఆ శిష్యునికి తెలియదు.

రామతీర్థుడు బోధ పూర్తిచేసిన తర్వాత శిష్యులంతా లేచారు. కాని ఒక్కడు మాత్రం ఆనందాశ్రువులతో అలానే కూర్చుని ఉన్నాడు. అతనిని చూసి మిగిలిన శిష్యులంతా గురువుగారు చెప్పిన బోధ వినలేదని హేళన చేసారు.

కాని రామతీర్థ మాత్రం ఆ శిష్యుని చూసి 'నాయనా ధన్యుడవయ్యావు. గీతాబోధ సారాన్ని గ్రహించావు. నీ జన్మని సార్థకం చేసుకున్నావు. గురుఋణం తీర్చుకున్నావు.  నీలాటి శిష్యుడు ఒక్కడున్నా చాలు, నా జన్మ సార్థకం అయింది' అంటాడు.

'చూశారా! అలా ఉండాలి గురుబోధయందు ఆసక్తి' అన్నారు శ్రీ బాబు.

మంత్రివర్యులు రాగానే నమస్కారం చేస్తూ 'మేము రాజకీయ నాయకులం కదా! పరిపాలనలో ఏవో తప్పులు చేస్తాం. వాటిని మీవంటి మహాత్ములే సరిదిద్ది మమ్మల్ని రక్షించాలి' అన్నారు.

వెంటనే డాక్టరు రాజు దానికి బాబు చెప్పిన సమాధానాన్ని చెప్పారు. 'అదే కదా మా కర్తవ్యం. మహాత్ములంతా దేశప్రజల క్షేమాన్నే కోరతారు. వారు ఎక్కడ ఉన్నా వారి ప్రార్థనలో ఎప్పుడూ సర్వేజనాస్సుఖినోభవంతు అని ఆశీర్వదిస్తారు' అని శ్రీ బాబు చెప్పినదాన్ని డాక్టరు రాజు చెప్పారు.

'ఇప్పటికి అందుకున్నావన్నమాట' అన్నారు శ్రీ బాబు. డాక్టరు రాజు మాట్లాడుతూ 'మీరు అడగగానే Confuse అయ్యాను బాబూ!' అన్నారు.

'ఆ సంగతి నాకు చెప్పకు. అది లౌక్యంగా మీలో మీరు మాట్లాడుకోవలసిన విషయం. గురుదేవుల దగ్గర చెప్పవలసినదికాదు. నీ మనస్సు నిలిచినపుడు Confusion ఎందుకు? శనగగింజని పంచదార నీళ్ళలో వేసి ఉంచామనుకో ఆ గింజని కదిపితే దాని మాధుర్యాన్ని కోల్పోతుందా?' అన్నారు శ్రీ బాబు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## కృష్ణ చైతన్యం

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానమ్ సృజామ్యహమ్॥**

అని గీతాచార్యుడు సెలవిచ్చి యున్నారు – ఎప్పుడెప్పుడు ధర్మానికి కష్టం సంభవిస్తుందో, అప్పుడు అధర్మాన్ని ఖండించి, ధర్మాన్ని నిలబెట్టడానికి నన్ను నేనే సృష్టించుకుంటానన్నాడు కృష్ణపరమాత్మ.



ఈ విధంగా, లోక సంరక్షణ కోసం, రూప నామక్రియా రహితమైన ఆ అనంతశక్తి, ఒక రూపం దాల్చి, దేవకీవసుదేవులకి సుతుడుగా ఆవిర్భవించిన మహా పుణ్యదినం, గోకులాష్టమి. కంసుని చెరసాలలో ఆ చిన్నారి శిశువు ఆవిర్భవించేసరికి, ఆ దివ్య చైతన్యం యొక్క ప్రభావం చేత, దేవకీ వసుదేవులు చేతులకీ, కాళ్ళకీ వున్న బంధాలన్నీ తృటిలో తెగిపోయాయి. తాళాలన్నీ ఊడిపోయాయి. జైలు తలుపులు తెరుచుకున్నాయి! ఇదంతా కనురెప్పపాటు కాలం కంటే యింకా తక్కువ టైములో జరిగిపోయింది (బ్యాటరీలైటు వేసిన క్షణంలోనే చీకటి మటుమాయమైనట్లు). ఇది నిజమేనా? నమ్మదగినదేనా? అని మీకు అనుమానం రావచ్చు.

ఒక 'ఆటంబాంబు' ప్రేలితే, ఆ ప్రాంతంలో వున్న సర్వస్వమూ నశించిపోతుంది కదా, మరి ఈ ఆటంబాబులకి కూడా శక్తినిచ్చే, అనంత శక్తియైన 'కృష్ణ చైతన్యం' జైలు తలుపుల తాళాలని, దేవకీ, వసుదేవుల సంకెళ్ళని ఛేదించి, వారికి బంధ విముక్తిని కలిగించిందనటంలో ఆశ్చర్యమేముంది? అందుకే ఆ పరమాత్మని **అణోరణీయాన్ మహతో మహీయాన్** అని శృతులు కీర్తించాయని చెప్పేవారు శ్రీబాబూజీ మహరాజ్.

తాను చలించకుండా, సమస్త జగత్తునూ, చలింపచేసేది ఆటలాడించేది 'కృష్ణ చైతన్యం'. 'కృష్ – నాశయితి కృష్ణః' అంటే అజ్ఞానాన్ని నశింప చేసేవాడు, అని కృష్ణ నామానికి అర్థం. అటువంటి నిర్గుణ పరబ్రహ్మతత్వం, సాకార రూపం ధరించి వచ్చినప్పుడు, దేవకీ వసుదేవులు, నందయశోదలు తమ బిడ్డగాను, గోపబాలురు, ఉద్ధవుడు, కుచేలుడు, అర్జునుడు యిత్యాదులు తమ సచివుడు (స్నేహితుడు) గాను, ఆత్మ నివేదన భక్తికి పరాకాష్ఠ స్వరూపులైన రాధ, గోపికలు ఆ స్వామినే తమ భర్తగాను ప్రేమించి తరించారు. ఆ పరమాత్మ యొక్క నిజతత్వం తెలుసుకోలేని కంసాది దానవులు

తమ వినాశనాన్ని తామే కొని తెచ్చుకున్నారు. అయినా కూడా భగవద్గీతలో తాము చెప్పినట్లు **అపి చేత్సు దురాచారః భజతే మామ్ అనన్యభాక్** అని – వైరంతోనైనా అనుక్షణం కృష్ణనామాన్నే స్మరించి, కృష్ణ రూపాన్నే చూసిన కంసాదులని కూడా తనలోనే లీనం చేసుకుని వారికి కూడా ముక్తిని ప్రసాదించాడు ముకుందుడు.

మనలోనే ఉన్న పరమాత్మని తెలుసుకోనీయకుండా అడ్డు వచ్చే అహంకార మమకారములనే కంస శిశుపాలురని కడతేర్చి, అఖండము, అద్వితీయము అయిన కృష్ణ చైతన్యంతో మన హృదయాలను నింపి గురుపాదుకలు కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!"

## ఏమి సేతురా బాబు!

- బొంబాయి కృష్ణారావు

ఏమి సేతురా బాబు ఏమి సేయగలనురా బాబూ
వేలరూకలుతెచ్చి నీకడిద్దామంటే, కోటీశ్వరులు క్యూలో కనపడ్డారు బాబూ.,
ఏమి సేతురా బాబూ...
ఒక శ్లోకము నేర్చి నీ ముంగిట చెబుదమంటే, భగవద్గీతను మింగిన ఘనులెదురైనారు బాబూ.......
కనులు మూసికొని మూడునిమిసాలు ధ్యానంచేద్దామంటే, ముక్కంటిని చూసిన మహాభక్తులున్నారు బాబూ.....
చిన్న సోఫాలో కూర్చుండబెడదామంటే, గాజులిప్పులతో ఇల్లిచ్చిన దాతలున్నారు బాబూ....
చేతనయినా పని చేద్దామంటే, ఒక క్షణం నిను వీడని దాసులున్నారు బాబూ.....
పిల్లలకు సేవ నేర్పుదామంటే, తరతరాలుగా నిను వీడని వంశాలున్నాయి బాబూ...
అందులకే మదిని నీకిచ్చి నీ ఎరుకలో ఇరుక్కుపోయాను బాబూ .
అట నీవు లేవు నేను లేను అట లేదు ఇటలేదు, లేకపోవడం లేదు, ఉండటం అసలే లేదు...

# మకర సంక్రాంతి

- పాలూరి కాళీప్రసాద్

నరేష్: సంక్రాంతి శుభాకాంక్షలు అన్నా!

సురేష్: నీకు కూడా నరేష్! అసలు ప్రతినెలా సంక్రాంతి వస్తుంది తెలుసా? ఇవాళ వచ్చింది, మనం ప్రముఖంగా జరుపుకునేది, మకర సంక్రాంతి.

న: అసలు సంక్రాంతి అంటే ఏంటన్నా?

సు: సూర్యుడు కానీ, నవగ్రహాలలో మరేదైనా గ్రహం కానీ ఒక రాశి నుండి మరొక రాశికి మారడాన్ని సంక్రాంతి అని, క్రాంతి అని, కార్తె అని అంటారు. ఇందులో సూర్యుడు మనకు అతి ముఖ్యుడు కదా! ఆయన మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. అందుకే మనం ఈ మకర సంక్రాంతిని పెద్ద పండుగ అని గొప్ప ఉత్సవంగా జరుపుకుంటాం. అసలు మన పురాణాలలో మకరం ఎక్కడ కనిపిస్తుంది చెప్పు నరేష్!



న: నాకు గుర్తుంది అన్నా! గజేంద్ర మోక్షంలో ఏనుగును పట్టుకొన్నది మొసలే కదా.

సు: అవును. నిజానికి మనం గజేంద్ర మోక్షం అంటాం కానీ, విష్ణుమూర్తి గజేంద్రునికి కేవలం మొసలి బారినుండి విముక్తి కలిగించాడు కానీ, ఆ మొసలికి మాత్రం ఆయన చేతిలో, సుదర్శన చక్రంతో మరణించడంతో ఏకంగా ఈ సంసారం నుండే మోక్షం లభించింది కదా!

న: అవును, ఆలోచిస్తుంటే నాకు ఒకటి అనిపిస్తోంది. విష్ణుమూర్తికి ఏనుగు కన్నా మొసలి అంటేనే పక్షపాతం అని. ఎంతైనా ఏనుగు జరాయుజం (తల్లి గర్భంలో ఉండి మావి నుండి పుట్టినది), మొసలి అండజం (గుడ్డు నుండి పుట్టినది) కదా!

సు: అయితే!?

న: అదే అన్నా! ఆయన అండజ (గరుడ) వాహనుడు, అండజ (ఆదిశేష) శయనుడు కదా! పైగా మకరకుండలధారి కూడానూ!

సు: అదేం లేదు. ఆయనకు సర్వ జీవులు సమానమే. **సమోహం సర్వ భూతేషు నమే ద్వేష్యోస్తి న ప్రియః** – నేను సర్వ భూతముల యందు సమదృష్టి కలిగి ఉంటాను. నేను ద్వేషించే వారుకాని, ప్రేమించే వారుకాని ప్రత్యేకంగా ఎవరూ లేరు, అని భగవద్గీతలో ఆ స్వామే చెప్పారు కదా!

న: అవుననుకో కానీ మళ్ళీ ఆయనే భక్తియోగంలో **యో మద్భక్త స మే ప్రియః** అని రెండుసార్లు, ఇంకా **స చ మే ప్రియః, భక్తిమాన్యః స మే ప్రియః, భక్తిమాన్మే ప్రియో నరః, భక్తాస్తేऽ తీవ మే ప్రియాః** అని నా భక్తుడు నాకు అత్యంత ప్రియమైన వాడు అని ఇన్నిసార్లు చెప్పాడు కదా!

సు: అదే ఇక్కడ కిటుకు. గాలి మన చుట్టూ అంతటా వ్యాపించి ఉన్నా ఫ్యాను కిందనే మనకు బాగా అనుభవంలోకి వచ్చినట్లు, పరమాత్మ అంతటా సమానంగానే ప్రకాశిస్తున్నా **భక్తానాం హృదయాంబోజే విశేషేణ ప్రకాశతే** – భక్తుల హృదయ కమలాలలో విశేషంగా ప్రకాశిస్తూ ఉంటాడు. ఆయనను పట్టుకోవాలంటే ముందు భాగవతులను పట్టుకోవాలి. అక్కడ ఆ మొసలి చేసినది అదే. అందుకే దానికి మోక్షం లభించింది.

న: అదేంటి అది భాగవతుడిని హింసించింది కదా?

సు: ఒక్కసారి ఆలోచించు. నారాయణమూర్తి వచ్చేముందు ఆ మొసలి, ఏనుగు వెయ్యి సంవత్సరాలు పోరాడాయి. ఏనుగుకు అయితే అది జీవన్మరణ సమస్య కాబట్టి విడవకుండా పోరాడింది. మరి మొసలికి ఏమవసరం? ఈ ఏనుగు కాకపోతే ఇంకో పీనుగు, తన కడుపు నింపుకోవడానికి ఏదో ఒక జంతువు దొరక్కపోదు. ఈ ఏనుగుకు ఉన్నట్లుగానే ఆ మొసలికి కూడా భార్య, పిల్లలు ఉండి ఉంటారు కదా! వాళ్ళందరూ ఈ వెయ్యి సంవత్సరాలలో ఎన్నోసార్లు వచ్చి "ఎందుకండీ మీకు ఇంత మొండిపట్టు? నిద్రాహారాలు మాని ఇన్నేళ్ళనుంచి ఆ ఏనుగు పాదాన్ని పట్టుకొని ఉండకపోతే వదిలేసి ఇంకొక వేట ఏదైనా చూసుకోవచ్చు కదా!" అని ఎన్నిసార్లు నచ్చచెప్పి ఉంటారు? అయినా ఆ మొసలి తన పట్టుదలను వదిలిపెట్టలేదు. "బలమైన పట్టుదలే వైరాగ్యం" అని శ్రీ బాబూజీ మహరాజ్ వారు ఎన్నోసార్లు చెప్పారు కదా! భక్తి, జ్ఞానము కలగాలంటే ముందు మనకు ఈ వైరాగ్యం ఉండాలి. మనందరినీ అటువంటి మొసలిపట్టు లాంటి అంతటి బలమైన వైరాగ్యాన్ని పెంపొందించుకోమని ఈ మకర సంక్రాంతి సూచిస్తోంది.

న: నిజమే అన్నా! మరి విష్ణుమూర్తి మకర కుండలాలు ధరించడంలో రహస్యం ఏమిటో కాస్త చెప్పరాదూ.

సు: విష్ణుమూర్తి జన్మ నక్షత్రం శ్రవణం. అది మకర రాశిలో ఉంటుంది కాబట్టి ఆ రెండింటినీ గుర్తుచేస్తూ ఆయన శ్రవణేంద్రియాలకు మకర కుండలాలు ధరిస్తాడని పైపై అర్థం చెబుతారు. కానీ, **సన్న్యస్య శ్రవణం కుర్యాత్** అని ఋషి వాక్యం. శ్రవణం చేసేటప్పుడు ఇతర విషయాలన్నింటినీ సన్యసించి శ్రవణం చెయ్యాలి. అటువంటి వైరాగ్యంతో, పట్టుదలతో శ్రవణం చేసినప్పుడే అది మళ్ళీ మననానికి వచ్చి నిదిధ్యాసకు

నిన్ను తీసుకెళ్తుంది కానీ సత్సంగంలో కూర్చున్నంత సేపు వచ్చిపోయే వాళ్ళను చూస్తూ, గోళ్ళు కొరుక్కుంటూ, మరేదో చేస్తూ వింటే అది నీ చెవికెక్కదు, మనసుకు అసలే పట్టదు. ఈ విషయాన్ని మనకు తెలియజెప్పడానికే నారాయణుడు తన చెవులకు మకర కుండలాలను ధరిస్తాడు.

న: ధన్యవాదాలు అన్నా! భక్తి జ్ఞానాలు కలగాలన్నా, విన్న ఆధ్యాత్మిక విషయాలు వంటబట్టాలన్నా మకరం లాంటి పట్టుదల, వైరాగ్యం ఎంత అవసరమో చక్కగా వివరించావు. నీకు మీ కుటుంబ సభ్యులకు మరొక్కసారి మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు! ఈ సందర్భంగా ఇటువంటి వైరాగ్యాన్ని శ్రీ గురుదేవులు మనందరికీ ప్రసాదించాలని ప్రార్థిద్దాం.

**ప్రేమాస్పదురాలైన తల్లి చెప్పేదాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ తల్లి చెప్పిన తరువాతే ఆయన తండ్రి అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల గౌరవాన్ని, భయ భక్తులను వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పకపోతే తండ్రి ఎవరో ఎలా తెలుస్తుంది? కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితే గాని యదార్థ జ్ఞానం కలుగదు. అటువంటప్పుడు కనులకు కానరాని లోకజనకుడు, సృష్టికర్త, సర్వవ్యాపియైన ఆ పరమాత్మ గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు? ఇంకెవరు?? చీకటి నుంచి వెలుగు వైపుకు నడిపించే సద్గురువే మనకు భగవత్ సంబంధమైన జ్ఞానాన్ని సుబోధకం చేస్తాడు.**

- శ్రీ గురుదేవులు

# ఉప పర్వణుడు

- సన్నిధానం కాళీమాత

బ్రహ్మ తన కర్తవ్యమైన సృష్టి చేయడం కోసం తన మానస పుత్రులుగా బ్రహ్మర్షులను, తన అవయవముల నుండి మరి కొంతమంది ఋషులను సృష్టించాడు. నారద మహర్షిని తన గ్రీవము నుండి సృష్టించాడు. వారందరిని తను చేసే సృష్టి వ్యాప్తికై వివాహాలు చేసుకుని, సంతానం కనమని కోరగా వారు నిస్సంగులై తపస్సుకు వెళ్ళారు. నారదుడు కూడా అటువంటి అభిప్రాయములోనే వుండి ఆ విషయమే బ్రహ్మ దేవుడికి చెబుతూ 'తండ్రీ! నీవు చెప్పిన అష్టాక్షరీ మంత్ర జపం చేసుకుంటూ విష్ణుపదం చేరాలని వుంది. నేను మాత్రం వివాహం చేసుకోను' అని చెప్పాడు.

బ్రహ్మ దానికి కోపించి అందరూ వైరాగ్య ప్రవృత్తిని అవలంబిస్తే, నా కార్యం ఎలా సాగుతుంది? నువ్వు అవిధేయుడిగా ప్రవర్తించావు కనుక నీలో వైరాగ్యాన్ని తొలగించి, అవిద్యను ప్రవేశపెడతాను. నీకు శారదామాత వరం వల్ల సంగీతం వున్నది కనుక దానినే ప్రవృత్తిగా గల గంధర్వుడిగా, స్త్రీలోలుడిగా జన్మించి, నా సంకల్పం నెరవేర్చు' అని శాపం ఇచ్చాడు.

సంగీతము, నాట్యము మొదలైనవి గంధర్వ విద్యలు. వారి లోకంలో వారికి అదే వృత్తి. ప్రవృత్తి. వాటి ద్వారా వాళ్ళు ఈశ్వరారాధన చేస్తారు, సుఖంగానే వుంటారు. కాని భక్తి పరాకాష్ట, జ్ఞానము, అంతర్ముఖత్వము వుండదు. అందువల్ల వారికి ఈశ్వరారాధన వున్నప్పటికి  ఇంద్రియ లోలత్వంలో వుంటారు. నారదుడు ఆ బ్రహ్మ శాపానికి బాధపడి 'తండ్రీ! నీవిచ్చిన అష్టాక్షరీ మహామంత్ర ఉపదేశం అప్రతిహతమైన శక్తి కలది. నేను ఏ గంధర్వుడిగా జన్మనెత్తినా, ఇంద్రియలోలత్వంలో మునిగినా, ఆ హరిభక్తి, అష్టాక్షరీ నన్ను విడువకుండు గాక!' అని దృఢ సంకల్పంతో సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

గంధర్వ లోకపు రాజుకు అన్ని సంపదలూ వున్నాయి కానీ, పుత్ర సంతతి లేదు. ఆయన తన గురువైన వశిష్ఠుని దగ్గరకు వెళ్ళి ప్రార్థించగా, ఆయన 'నీ కోరిక నెరవేరడానికి, కవచ సహితంగా, ఒక ఉపదేశం చేస్తాను. నీవు భక్తితో భూలోకంలోని పుష్కర పుణ్యతీర్థ సమీపంలో శివుని గురించి తపస్సు చెయ్యి. తప్పక పుత్ర సంతానం కలుగుతుంది' అని చెప్పగా ఆ గంధర్వ రాజు గురువు చెప్పిన ప్రకారం నూరు దివ్య సంవత్సరాలు తపస్సు చేయగా పరమేశ్వరుడు ప్రత్యక్షమై 'విష్ణు భక్తుడైన కొడుకు పుడతాడు' అని వరం ఇచ్చాడు.

గంధర్వ రాజుకు గురువు అనుగ్రహం వలన పుత్రోదయం అయింది. వశిష్ఠ మహర్షి ఆ బాలుడికి ఉపపర్వణుడు అని నామకరణం చేశాడు. అంతేకాక, శ్రీహరి మంత్రోపదేశం కూడా చేశాడు. నారదుడే శాపవశమున జన్మించిన గంధర్వుడు ఉపపర్వణుడు.

ఉపపర్వణుడు అత్యంత హరిభక్తి కలవాడై ప్రస్తుతం నేపాల్ ప్రాంతంలో వున్న గండకీ నది తీరాన శ్రీహరి మంత్ర పునశ్చరణ చేస్తూ తపోవృత్తిలో ఉన్నాడు. బ్రహ్మదేవుని శాప ప్రకారం గంధర్వుడిగా జన్మించడమేకాక, మరి ఇంద్రియలోలత్వం కూడా సంభవించాలి కదా!

ఒకనాడు ఉపపర్వణుడు గండకీ నదిలో స్నానం చేస్తుండగా, చిత్రరథుడు అనే గంధర్వరాజు కుమార్తెలు యాభై (50) మంది వచ్చారు. వారు ఆయన సమీపంలోనే స్నానం చేస్తూ, ఆయనను ఏడిపిస్తూ, అల్లరి చేయసాగారు. దీనితో ఆయన మనస్సు చలించింది. వాళ్ళు ఆయనను **మోహించారు**. ఆయనను కూడా **మోహింపజేశారు**. వారి మోహంలో పడి ఆయన శ్రీహరి మంత్రాన్ని గండకీ జలాలలో వదలి, ఆ యాభై మందినీ వివాహం చేసుకున్నాడు. వారిలో మాలావతి అనే ఆమె యెడల ఆయనకు ఎక్కువ మక్కువ కలిగింది.

విశ్వసృష్టి చేసే నవ బ్రహ్మలు ఒకసారి దేవసత్రం అనే గొప్ప యాగం తలపెట్టారు. వారు ఉపపర్వుణ్ణి అతని భార్యలతో సహా వచ్చి శ్రీహరి గాధలను గానం చేయవలసినదిగా కోరారు. ఆయన భార్యలతో సహా బ్రహ్మలోకంలో విష్ణుగాధలను గానం చేస్తూ వున్నాడు. అయితే బ్రహ్మశాపం ఇంద్రియలోలత్వం వుండటం వలన రంభతో అనుచిత ప్రవర్తన చేయసాగాడు. ఆ దోషానికి విశ్వ స్రష్టలు కోపించి, భూలోకంలో కడజాతివారికి పుత్రుడుగా జన్మించమని శపించారు.

ఉపపర్వణుడు జరిగినదంతా తన భార్యలకు చెప్పి, తన ప్రాణాలను విడిచిపెట్టాడు. ఆయన భార్యలందరూ విలపించసాగారు. మాలావతి తన చెల్లెళ్ళను ఊరడించి, దేవతలతో 'నా భర్తను పునర్జీవితుడిని చేయండి. లేకపోతే బ్రహ్మకు సృష్టి చేసే శక్తి లేకుండా నశించి పోవుగాక, యముడి ధర్మం నశించుగాక! ఈశ్వరుడి జ్ఞానం నిష్ఫలమగు గాక!' అని శాపోదకం వదిలింది. ఆమె మహాపతివ్రత. ఆమె శాపం అమోఘం. దేవతలు భయపడి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. విష్ణువు వారికి అభయమిచ్చి, ఒక బ్రాహ్మణుడి వేషంలో మాలావతి దగ్గరకు వచ్చి, ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. కొంత వేదాంతం చెప్పడం మొదలు పెట్టగానే, ఆమె తన పట్టుదల వదలక, 'బ్రాహ్మణుడా! నీ వేదాంతం నాకు అక్కర్లేదు. నా భర్త పునర్జీవితుడు కావలసిందే' అన్నది. అప్పుడు ఆ కపట బ్రాహ్మణుడు కొంత ఆయుర్వేదం గురించి ఆమెకు వివరించాడు.

'వాత, పిత్త, శ్లేష్మ లక్షణాలలో అసమానతల వల్ల జ్వరాలు అనేక రకాలుగా వస్తాయి. దానికి ఉపశమనం చేయవచ్చు. కానీ, నీ భర్త చనిపోయాడు కదా! ఇందులో ఏ కారణంతో పోయాడో చెబితే, తగిన ఉపచారం చేసి ప్రయత్నించ వచ్చు. సరియైన కారణం చెప్పగలవా!' అనగా, 'నా భర్త ఏ రోగంతోనూ మరణించలేదు, శాపం వలన అకాల మృత్యువు' కలిగింది. నా భర్త తిరిగి రాకపోతే, నా శాపం అప్రతిహతం' అని ప్రతిజ్ఞ చేసింది. బ్రహ్మ అప్పుడు విష్ణువుతో 'లోక క్షేమం కోసం ఇతడిలో ప్రాణాలు తిరిగి ప్రవేశపెట్టక తప్పదు' అని తన కమండలంలోని జలములను ఉప పర్వణుడిపై జల్లి అతనిని తిరిగి బ్రతికించాడు. ఉపపర్వణుడు తన భార్యలతో సహా హరిజ్ఞానాన్ని వదలక, హరిని ధ్యానిస్తూ వేయి సంవత్సరాలు సకల సుఖాలు అనుభవించి, శరీరాన్ని విడిచిపెట్టాడు. అతని భార్యలందరూ అతనితో సహగమనం చేశారు. దేహధారులకు సుఖ దుఃఖాలు, కష్టనష్టాలు ఏమి వున్నా, భగవదారాధన తప్పరాదని ఉప పర్వణుని వృత్తాంతము మనకు బోధిస్తుంది. ( - భాగవత సప్తమ స్కంధం నుండి)

# శ్రీ మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి) -డా. పి. రాఘవేంద్ర

ఒకసారి ఒక భక్తుడు వచ్చాడు. అతడు తనకు ధ్యానం కుదరటం లేదు అని చెప్పుకున్నాడు. సరే, ఆ భక్తుడు రెండు పూటలా భోజనం అయితే తప్పనిసరిగా చేస్తాడు గదా అని, భోజనానికి ధ్యానానికి లింకు పెట్టి, బాబు ' నీవు ధ్యానం చేసుకోనిదే భోజనం చేయద్దు' అని చెప్పారు. సరే పాపం, అతను ఒక పూట ఏదో ధ్యానం చేశాడు. కానీ రెండో పూట వచ్చేసరికి ధ్యానం మానేశాడు. ధ్యానం చేయలేదు కనుక భోజనం కూడా మానేశాడు. మర్నాడు అంతే. చివరకు ధ్యానం చేయలేదు కాని నీరసపడి ఇంక తాళలేక భోజనం మాత్రం చేశాడు. శ్రద్ధ లేకపోతే ధ్యానం కుదరదు.

ఏం మాట్లాడాలి, ఎలా ఉపన్యాసం చెప్పాలి అన్న ఆలోచన నీకు అనవసరం. శాస్త్ర చర్చల్లోకి వాగ్వివాదాల్లోకి దిగవద్దు. నీవు శాస్త్ర చర్చలోకి దిగావా, ఘృతానికి పాత్ర ఆధారమా, పాత్రకు ఘృత మాధారమా అన్న చర్చలో పడి ఘృతాన్ని అంతా నేలపాలు చేసుకున్న పండితునికి పట్టిన గతే నీకూ పడుతుంది. ఏం మాట్లాడాలి, ఎలా ఉపన్యాసం చెప్పాలి అన్న ఆలోచన నీకు అనవసరం. గురుపాదముల యందు అటువంటి అచంచల విశ్వాసం కుదిరినప్పుడు నీకు గురుతత్వం అర్థమవుతుంది. ఆ గురుతత్వం నిన్ను "నీవు ఈ దేహానివి కాదు అనే దాని దగ్గర మొదలుపెట్టి నీ నిజ స్వరూపం ఏమిటో నీకు తెలియచేసేలా చేస్తుంది". **'మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం మయి సర్వంలయం యాతి తద్బ్రహ్మాద్వయ మస్మ్యయం"**

అన్నీ నీలో నుండే ఉద్భవిస్తున్నాయనీ, అన్నీ నీలోనే ధరింపబడి ఉన్నాయని, అన్నిటిలోనూ నీవే వున్నావని, అన్నీ నీలోనే లయం అవుతున్నాయనే సత్యాన్ని దర్శింప చేస్తుంది. అలా దర్శింప చేసేవాడే సద్గురుదేవుడు. ఇన్నాళ్ళ నుండి ఆశ్రమానికి వస్తూనే వున్నామండి, అయినా పనులు కావడం లేదండి, కష్టాలు తప్పడం లేదండి అంటూ వుంటారు కొందరు. తప్పెవరిదో ఆలోచించండి. బాబూజీ వారితో ఎవరైనా అలా అన్నప్పుడు బాబూజీ "మిమ్మల్ని నేను పనులు మానుకొని ఇక్కడికి రమ్మన్నానా?" అని మందలించేవారు. "నీవు పనులు చేయడం మానుకోనవసరం లేదు. పనిచేస్తూనే నన్ను తలచుకో", అని చెప్పి, తనను మరువక స్మరిస్తూ వున్న వారందరికీ తాను నిజంగా ఎవరో తత్వతః తెలిసేలా చేసేవారు.

ఎవరో భక్తుడు దీర్ఘ రోగంతో బాధపడుతూ బాబూజీ దగ్గరకు వచ్చి తన బాధనంతా వెళ్ళబోసుకునేవాడు. బాబూజీ, "ఛీ! వెంటనే వెళ్ళిపో" అని గట్టిగా అరిచేవారు. ఆ తరువాత ఆ రోగం మాయం కావడం అనేది ఎందరో భక్తులకు

అనుభవంలో ఉన్నది. ఎందరో భక్తులు బాబూజీ అనుగ్రహాన్ని అలా చూర గొన్నారు. వారు పొందిన అనుభవాలు, ఆనందం అనుభవించి తెలుసుకోవాలే తప్ప, లేకపోతే అర్థం కాదు.

గురుదేవుడిని నరుడిగా చూస్తే, నీవు దేనినీ పొందలేవు, చెప్పుడు మాటలు విని చెడిపోవద్దు అని గురుపాదుకలు నిన్ను హెచ్చరిస్తున్నాయి. బాబూజీ నేను మిమ్మల్ని కామవరపుకోట జీడిలా పట్టుకుంటాను. తరింప చేసేదాకా వదలను. నీవు తప్పించుకోవాలన్నా తప్పించుకోలేవు. తాడుతో గుంజకు కట్టి వేయబడిన ఆవు, తాడు ఎంతవరకు వస్తుందో అంతవరకే స్వేచ్ఛగా తిరగ గలుగుతుంది. కానీ వదిలించుకుని మాత్రం పోలేదు. నీవు కూడా అంతే. నీవు కూడా ఒక స్తంభానికి కట్టి వేయబడ్డావు. ఆ స్తంభమే నేను. నేను నిన్ను ఎంత దూరం పోనిస్తే అంతవరకు స్వేచ్ఛగా ఉన్నట్లు అనుకుంటావు. కానీ నీవు నాకు కట్టి వేయబడి ఉన్నావని నేను నిన్ను తరింప చేసేదాకా వదలను అన్న విషయం నీవు గ్రహించలేవు" అని అనేవారు.

ఆశ అనే నీ తృష్ణ, గురుదేవుని కృపను పొందితే గాని తీరదు. ఎప్పటికీ "ఏడుగడ" ఆ గురుదేవుడే అని గురుపాదుకులు నిన్ను హెచ్చరిస్తున్నాయి. స్వామి బోధను మనసులో స్మరిస్తూ సత్యమార్గాన్ని అనుసరించే వారికి భయం ఏముంటుంది? వారు ఆ స్వామిని హృదయ స్థానంలో ఏర్పరచుకుంటారు. వారికి సంసారం అంతా కల వంటిది అని తెలుస్తుంది. అటువంటి కల అయిన యిలను గూర్చి కలవరపడవద్దు అని గురుపాదుకలు హెచ్చరిస్తున్నాయి. ఇది నిజం. దీనిని నమ్మండి. నమ్మిన వాళ్ళకు బంగారు పిచ్చుక, నమ్మని వాళ్లకు బూడిదే అని గురుదేవులు ఎన్నోసార్లు చెప్పారు.

అటువంటి గురుదేవులను మనం హృదయ సింహాసనం పైన ప్రతిష్టించు కోవాలి. అప్పుడు శ్రీ గురుదేవులు మనకు ముక్తి మార్గం చూపెడతారు. మనం వినమ్రతతో వినయ విధేయతలతో మన తను మన ధనములను సంపూర్ణంగా ఆ స్వామికి సమర్పించుకోవాలి. ఆ స్వామిని సేవించి తరించాలి. భూమినే భూర్జపత్రంగా చేసి, కల్పద్రుమాన్నే సురలేఖినిగా చేసి యుగయుగాల పర్యంతమూ లిఖిస్తూపోయినా ఎవరి అనంత సుగుణ సంపదను పూర్తిగా వర్ణించడం సాధ్యం కాదో అట్టి అనంత కళ్యాణ గుణ సంపన్నుడైన భగవంతుడే సద్గురుదేవుడు. అట్టి సమర్థ సద్గురుదేవుని నీవు ఏ పరిస్థితుల్లో వున్నా, కూర్చుని ఉన్నా, నిల్చొని వున్నా, పడుకొని ఉన్నా, ఎలా ఉన్నా సరే మరవకుండా బోధలో వచ్చిన అమృతాన్ని, బాబు అందించిన అమృతాన్ని నిరంతరం గ్రోలుతూ జ్ఞాపకం చేసుకుంటూ మీరు మీ అమూల్యమైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని తరించాలి.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

అత్యంత మధురంగా, భావగంభీరంగా కవిత్వం చెప్పగలిగిన కవులెందరో ఉన్నారు. అత్యంత సుందరమైన కళాఖండాలను సృష్టించిన కళాకారులెందరో ఉన్నారు. అయినా వారిలో చాలామంది జీవితాలు అత్యంత సాధారణమైనవి. ఏ మాత్రం ఆధ్యాత్మిక వికాసమూ లేని జీవితాలు వారివి. నీ ఆలోచనలు, భావాలు, ఊహలు, నీవు ఆచరించే కర్మలు, నీ ప్రవర్తన అన్నీ కలసి నీ వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తాయి. కేవలం ఉన్నతమైన ఆశయాలు, ఉదాత్తమైన ఆదర్శాలు మాత్రమే ఉన్న నీ వ్యక్తిత్వం ఇంకా వికాసం పొందాలి. మొదటగా నీవు నీ త్రికరణముల మధ్య సామ్యము లేదు అన్న నిజాన్ని గ్రహించాలి. ఇలాంటి వారినే శ్రీకృష్ణ భగవానుడు



ప్రజ్ఞా వాదులు అని గర్హించాడు. ప్రజ్ఞావాదులు గొప్పలు చెపుతారు కాని అతి సాధారణమైన బ్రతుకులు బ్రతుకుతూ ఉంటారు. వారి మనోద్వేగంలోని, భావోద్వేగంలోని ఆధ్యాత్మికత వారి భావాలను మాత్రమే ప్రభావితం చేయగలదు. దానివలన ప్రయోజనం ఏమిటి? నీలో ఉండే ఆధ్యాత్మికత వలన నీవే పూర్తిగా మారిపోవాలి. ఆ విధంగా శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి పక్వాహంకారాన్ని గురించి విశదపరిచాడు. నీలో కూడా ఈ రెండూ ఉన్నాయి. నీ సాధ్యం లేదా లక్ష్యం చాలా ఉదాత్తంగా ఉంటుంది. కాని నీ ప్రవర్తన నీ జీవన విధానం, నీ సాధన ఏవీ దానికి అనుగుణంగా ఉండవు.

శ్రీరామకృష్ణ పరమహంస అందుకే మరీ మరీ చెప్పారు "ముందు నీ మనస్సుకు, మాటలకు, చేతలకు మధ్య సామ్యం సాధించు" అని. నీవు "ఓ భగవంతుడా! నాకు నీవే కావాలి" అని ఎలుగెత్తి అరుస్తావు. పాడతావు. కాని నీ జీవితం, నీ సాధన, అంతా దానికి భిన్నంగా ఉంటుంది. కొందరు గొప్ప కవులు కావచ్చు. గొప్ప కళాకారులు కావచ్చు. గొప్ప ఉన్నతోద్యోగులు కావచ్చు. కాని వారిలో ఏ కొద్దిమంది జీవితాలో తప్ప మిగిలినవారి ఆధ్యాత్మిక జీవితం అతి సాధారణంగా ఉంటుంది.

అందుకే అరవిందులు అన్నారు. "నీకు నిజంగా భగవంతుడు కావాలి అని ఉంటే, నీవు అప్పుడప్పుడు ఆత్మశోధన, అవసరమైనప్పుడు ఆత్మనింద చేసుకో. నిజానికి అది ఆత్మనిందకాదు. నీవు జ్ఞానాన్ని పొందటానికి అది మొదటి మెట్టు అని గుర్తించు" అని. శ్రీకృష్ణ భగవానుడు "నీలోని పక్వాహంకారాన్ని నీ స్నేహితుడుగా భావించు, కాని అపరిపక్వాహంకారాన్ని మాత్రం పరమశత్రువుగా భావించు. దానిని దగ్గరకు

రానీయకు" అని చెప్పాడు. నీవు నీ జీవితంలో ఏ స్థితిలో ఉన్నావో ముందు సరిగ్గా తెలుసుకో.

ఈ సందర్భంగా శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన నీతికథను గుర్తు చేసుకో. ఒకరోజు రాత్రి కొంతమంది త్రాగుబోతులు బాగా తాగి వచ్చి పడవ ఎక్కి తెడ్డు వెయ్యటం మొదలుపెట్టారు. రాత్రి గ్రుడ్డి వెన్నెల కాస్తున్నది. వాళ్ళు అలా రాత్రి అంతా కాళ్ళూ, చేతులూ నొప్పి పుట్టేదాకా తెడ్డు వేస్తూనే ఉన్నారు. చివరకు తెల్లవారిన తరువాత చూస్తే పడవ ఒక్క అంగుళం కూడా కదలక ఎక్కడి పడవ అక్కడే ఉన్నది. కట్టుకొయ్యకు పడవను కట్టేసి ఉంచిన కట్టుత్రాడును విప్పలేదు అన్న సంగతిని చూసుకోలేదు ఆ ప్రబుద్ధులు. అలాగే నీ జీవిత నౌక కూడా లంగరు దించి ఉన్నది. అది సంసారం అనే కట్టుకొయ్యకు అహంకారం, మమకారం, అజ్ఞానం మోహం అనే రకరకాల త్రాళ్ళతో కట్టివేయబడి ఉన్నది. ఆసక్తి అనే త్రాడు నీ జీవితం అనే పడవను సంసారం అనే కట్టుకొయ్యకు గట్టిగా కట్టేసి ఉంచింది. నీ మనస్సు విషయాసక్తమై ఉన్నది. నీవు మాత్రం తెడ్డు వేస్తున్నావు. సాధన ముందుకు సాగటంలేదు అనుకుంటున్నావు. సాధన ముందుకు ఎలా సాగుతుంది? నీవు మొదట నీ మనస్సుకూ, మాటలకూ, చేతులకూ మధ్య సామ్యమును సాధించాలి. ఉదాత్తమైన ఆశయాలను, ఆదర్శాలను వల్లించటం కాకుండా, వాటిని ఆచరణలో పెట్టి, నిర్మలము, పవిత్రము అయిన జీవితాన్ని గడపాలి. అప్పుడు గాని నీ సాధన ముందుకు సాగి సిద్ధించదు.

అక్కడక్కడ అవసరమైతే చిన్న చిన్న సర్దుబాట్లు ఉండవచ్చు గాని, నీ లక్ష్యాన్నించి గాని, మార్గం నుండి గాని దూరంగా తీసుకొని వెళ్ళేవాటితో పూర్తిగా రాజీ పడటం అనేది ఉండకూడదు. అవసరమైతే కట్టుబాట్లు కొంచెం సడలించవచ్చు గాని విశృంఖలత్వం అసలే పనికిరాదు. దీని నుండి నీవు ఆశయాలకు లేదా ఆదర్శాలకు, జీవితానికి, జీవించటానికి, అలాగే భావములకు, మాటలకు, చేతలకు మధ్యగల అంతరాన్ని తెలుసుకో. శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడికి ఈ అంతరాన్ని చూపి, అర్జునుడిని నీవు ప్రజ్ఞావాదివి, కేవలం దంభములు పలుకుతున్నావు అని పరిహసించి, అర్జునుడిలో ఉన్న సాధకుడిని మేలుకొలిపే ప్రయత్నం చేస్తున్నాడు

- సశేషం

# స్వామి దయానంద మహరాజ్

సేకరణ - మురళీ

1919 మార్చి 19న పంజాబ్ లోని హెూషియార్పూర్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు మదన్ లాల్. తండ్రి ఘోషితారాం కాలియా, తల్లి శివదాయి. తండ్రి పవిత్రమైన భావాలు, నిజాయితీ గల సివిల్ ఇంజనీర్. మహా భక్తుడు కూడా. చిన్నప్పటి నుంచి మదన్ లాల్ లోతైన పరిశోధనాత్మక దృష్టి కలిగి ఉండేవాడు. ఒంటరిగా వుండటానికి ఎక్కువగా యిష్టపడేవాడు. విద్యార్థి దశలో ఆధ్యాత్మిక గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు చదవటానికే ఎక్కువ సమయం వినియోగించేవాడు. 8వ తరగతికి వచ్చే సరికి భగవద్గీత మొత్తం కంఠస్థం చేశాడు. చిన్న కాగితాల మీద వ్రాసి, అవి చిన్న వెండి భరిణలో పెట్టి తన కుడిచేతికి తాయెత్తులా కట్టుకున్నాడు. 10వ తరగతి ఉత్తీర్ణుడైన తరువాత ముందుకు చదవటానికి యిష్టపడక, కుటుంబ ఆస్తుల నిర్వహణలో తండ్రికి చేదోడుగా ఉండిపోయాడు. తండ్రి అభ్యంతరం చెప్పలేదు. తరచు తల్లిని హరిద్వార్, ఋషీకేశ్, ఇతర హిందూ పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యత గురించి అడుగుతుండేవాడు.

స్వామిజీ, తమ ఇంటిని విడిచి వెళ్లిన తరువాత, 1938 ఏప్రిల్‌లో జరిగిన కుంభమేళాకు ముందు హరిద్వార్‌కు చేరుకున్నారు. అక్కడ "మహంత్ శ్రీ సిద్ధ బాబా శ్యామ్ గిరి" శాఖకు చెందిన సాధువులతో కుంభమేళాలో పాల్గొనడం కోసం హరిద్వార్‌లో ఉన్నారు. అక్కడే, ఢిల్లీ యమునానది తీరంలో ఉన్న బాబా శ్యామ్ గిరి సమాధి స్థలం గురించి తెలుసుకుని, ఆ సమాధిని సందర్శించి, అక్కడే ఒంటరిగా ధ్యానంలో మునిగిపోయారు. ఇది ఆయనలో పరమాత్మ తత్వాన్ని తెలుసుకునే ఆకాంక్షను మరింతగా పెంచింది. కొన్ని రోజుల తర్వాత యమునా నది తీరంవెంట మథురకు కాలినడకన ప్రయాణం ప్రారంభించారు. మథురలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు మరియు ఓ యువకుడు స్వామిజీని ఆయన ప్రయాణ లక్ష్యం ఏమిటో అడిగారు. స్వామిజీ, తనను పరమాత్మ సన్నిధికి తీసుకువెళ్ళే నిజమైన సద్గురువును వెతుకుతున్నానని చెప్పారు. దానికి వారు ఆగ్రా సమీపంలో యమునా నది తీరంలో నివసిస్తున్న ఓ సిద్ధ సన్యాసి గురించి విన్నానని చెప్పారు.

యమునా నది తీరంగా ప్రయాణిస్తూ, స్వామిజీ ఒక రైతు గుడిసెను చేరుకున్నారు. తీవ్రమైన ఎండలో కాలినడకన ప్రయాణిస్తున్న స్వామిజీని చూసిన రైతు బయటకు వచ్చి, ఆయన ప్రయాణ లక్ష్యం ఏమిటని అడిగాడు. స్వామిజీ, పరమాత్మాన్వేషణ తపనతో ఉన్నానని చెప్పి, ఆగ్రా వద్ద యమునా తీరంలో ఆధ్యాత్మిక

జ్ఞానం గల మహానుభావులు ఉన్నారా అని అడిగారు. రైతు స్వామిజీకి కొంత తినే పదార్థాలు ఇచ్చి, విశ్రాంతి తీసుకోవాలని సూచించి, నదీ తీరంలో ఓ దివ్యమహాత్ముడు నివసిస్తున్నారని చెప్పారు. స్వామీజీ కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత ప్రయాణం కొనసాగించి, ఆగ్రాలో యమునా తీరంలో ఉన్న ఓ చిన్న గుడిసెకు చేరుకున్నారు. అక్కడ ఓ నాగసాధువు ధ్యానస్థితిలో ఉన్నారు. స్వామిజీ గుడిసెలోకి ప్రవేశించి నమస్కరించారు.

"నీవెందుకు ఇక్కడికి వచ్చావు?" అని సాధువు అడిగారు. "మీ పాదాలవద్దకు వచ్చాను" అని స్వామిజీ చెప్పారు. "ఎందుకు?" అని సాధువు అడిగారు. "పరమ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందే మార్గదర్శనం కోసం" అని స్వామీజీ తెలిపారు. "నన్ను ఎప్పుడూ కలవకపోయినా, నాలో నమ్మకాన్ని నీవు ఎలా కలిగి ఉన్నావు?" అని సాధువు ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా, "నా అంతఃకరణం నన్ను మీవైపు రప్పించింది. అంతఃకరణ భాష అబద్ధం చెప్పదు" అని పేర్కొన్నారు స్వామీజీ.

- సశేషం

## పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

జనవరి 2026

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – శ్రీ సద్గురు పాదపూజ.

3 శని: పుష్య పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

13 మంగళ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

14 బుధ: భోగి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

15 గురు: సంక్రాంతి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

23 శుక్ర; మాఘ శుద్ధ (వసంత)పంచమి – శ్రీ సద్గురు పాదపూజ.

25 ఆది: మాఘ శుద్ధ (రథ)సప్తమి – శ్రీ సద్గురు పాదపూజ.

29 గురు: మాఘ శుద్ధ (భీష్మ)ఏకాదశి – శ్రీ సద్గురు పాదపూజ.

ఫిబ్రవరి 2026

1 ఆది: మాఘ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

11 బుధ : శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

15 ఆది: మహాశివరాత్రి – శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**91. ఓం దీన బాంధవాయ నమః**

శ్రీ సద్గురు దేవులు దీన జనులను బంధువు వలె, తల్లి వలె ప్రేమించి, ఆదరించి, వాత్సల్యం కురిపిస్తారు. తల్లికి తన బిడ్డలందరూ సమానమే అయినా ఆర్థికంగా కాని, సామాజికంగా కాని చితికిపోయిన, లేదా తక్కువ స్థితిలో వున్న బిడ్డలపై ఎక్కువ వాత్సల్యము చూపినట్లు, సర్వ సృష్టికి తామే కర్త అయిన శ్రీగురుదేవులకు సకల జీవకోటిపై సమదృష్టి వున్నా దీనజనులపై అపరిమితమైన వాత్సల్యముతో వారిని బంధువువలె ప్రేమిస్తారు.

**92. ఓం ప్రసన్న వదనాయ నమః**

శ్రీ గురుదేవులు అత్యంత ప్రసన్నమైన ముఖము కలవారు. వారి ముఖములో ఎప్పుడూ చిరునవ్వు చెదరక దివ్య కాంతులను ప్రసరింప చేస్తూ చూచిన వారికి ఆత్మానందం ప్రసాదిస్తూ ఉంటుంది.

**93. ఓం మాన్యాయ నమః**

శ్రీ గురుదేవులు ఈ జగత్తు అంతటి చేత గౌరవింపబడేవారు. వారు త్రిమూర్తుల కంటే అధికులు. వారిని దర్శించిన మాత్రముననే ఎంతటి వారికైనను వారికి నమస్కరించ వలెనను భావము కలుగుతుంది.

**94. ఓం వరదాయ నమః**

శ్రీగురుదేవులు అడుగకనే అభయప్రదానము చేసే వరప్రసాదులు. వారి దక్షిణ హస్తము యెల్లప్పుడు అభయముద్రలోనే వుంటుంది."మీరు చేయవలసిన కనీస కర్తవ్యం ఆ అభయహస్తపు నీడలోకి వచ్చే ప్రయత్నం చేయటం. నా అభయ కిరణాలు నిరంతరం మిమ్మల్ని నీడలా వెన్నంటి వుండి మీకు రక్షణనిస్తాయి" అని శ్రీగురుదేవులు శాశ్వతమైన వరమును జీవకోటికి ప్రసాదించినారు. అభయ హస్తపు నీడలోకి రావటమంటే వారు నిర్దేశించిన మార్గంలో నడుచుకోవటమే. వారిని అశ్రయించిన వారి యొక్క ఎట్టి ధర్మ పరమైన కోర్కెలైనను వారిని అడుగకయే తీరిపోవును.

**95. ఓం వాంఛిత ప్రదాయ నమః**

పైన చెప్పినట్లు శ్రీ గురుదేవులు వారిని ఆశ్రయించిన వారి ధర్మపరమైన

కోర్కెలను అడుగకయే తీర్చుటలో సమర్థులు. వారు తమను నమ్మిన వారికి బంగారు పిచ్చుక.

**96. ఓం జగత్కళ్యాణదాయ నమః**

శ్రీ గురుదేవులు జగత్తుకంతటికీ శుభములు కలిగించువారు. వారు ఎక్కడ ఉంటే అక్కడ సకల శుభాలు చేకూరుతాయి. ఈ సకల జగత్తు అంతా వారి నుండి ఉద్భవించినదే. వారు ఎల్లప్పుడూ అందరికీ శుభం కలగాలనే కోరుకుంటారు. ఆశీర్వదిస్తారు.

**97. ఓం పుణ్యాయ నమః**

శ్రీగురుదేవులు పుణ్య స్వరూపులు. వారిని ఆశ్రయించి, వారిపై విశ్వాసముంచి, వారు ఆజ్ఞాపించిన కార్యములను తు.చ. తప్పక చేయు వారును పుణ్య స్వరూపులగుదురు.

**98. ఓం జ్ఞానదాయ నమః**

శ్రీ గురుదేవులు తమ శిష్యులకు జ్ఞానమును ప్రసాదించు వారు. గురు శబ్దములో గుకారము అజ్ఞానాన్ని, రుకారము దానిని పోగొట్టే ఆత్మ తేజస్సును సూచిస్తాయి. తమ శిష్యుల అజ్ఞానాంధకారాన్ని నశింపచేసి వారి హృదయాలలో జ్ఞాన భాస్కర కిరణాలను ప్రసరింప చేసి వారికి ఆత్మానందాన్ని ప్రసాదించే వారే సమర్థ సద్గురు దేవులు.

**99. ఓం భుక్తి ముక్తి దాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యులకు ఇహ పరాలు రెండింటిలోనూ ఏ లోటూ లేకుండా చేసెదరు. నేను ఆధ్యాత్మిక గురువును కనుక నీ భౌతిక విషయాలతో నాకు సంబంధం లేదు అని వారు ఏనాడూ అనలేదు. తమను ఆశ్రయించిన వారికి ఇహంలో ఏ లోటూ లేకుండా చేయుటమే కాక పరంలో మోక్ష సామ్రాజ్యాన్ని అందించటంలో వారు సమర్థులు.

**100. ఓం సర్వ సంపత్ప్రదాయ నమః**

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన వారికి సర్వ సంపదలను అనుగ్రహించి శాశ్వతమగు మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదిస్తారు. వారి భక్తులకు ఎప్పుడూ, ఏ విషయంలోనూ, ఏలోటూ రాదు.

- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్



గుఱ్ఱపు డెక్కల సవ్వడి విని, కాంతివిహీనమై లోతుగా గుంటలు పడ్డ వసుదేవుడి కళ్ళను మూస్తున్న రెప్పలు కొద్దిగా తెరుచుకున్నాయి. ఈ కళ్ళతో ఇంతకు పూర్వం తను ఎన్ని చూడలేదు! కాని ఇప్పుడు... ఇంక చూడదగినది ఏమి మిగిలి ఉన్నదని? పుత్రులు, మనుమలు, మునిమనుమలు, సోదరులు, ఆ సోదరుల సంతానం ఎవ్వరూ ఈనాడు జీవించి లేరు. కృష్ణ బలరాములు కూడా తనను ఒంటరిని చేసి పోయారు. ఒక్క వ్రజభూమి మాత్రం మిగిలి ఉన్నది. ఇంకా ఊహ తెలియని పసిగుడ్డు, అనిరుద్ధుని మనుమడు ఒక్కడే వున్నాడు.

ప్రభాసతీర్థంలో జరగబోయే యాదవవంశ వినాశనాన్ని గురించి కృష్ణుడు స్వయంగా తనకు చెప్తూ 'తండ్రీ! అన్న బలరాముడు తన అంతిమయాత్రకు సంసిద్ధుడై ఉన్నాడు. గాంధారి మాత శాపం ఫలించింది, అంధకుడు, వృష్ణి, భోజుడు, యాదవులందరూ కర్మాధీనులై మరణించినవారే. ఇక ఈ ద్వారక నేనుండటానికి యోగ్యం కాదు. నాన్నగారూ! నాకు అనుమతి ఇవ్వండి... ద్వారకలో నేనుండలేను' అన్నాడు.

వసుదేవుడు తన పుత్రుని శిరస్సు ముద్దాడి వణుకుతున్న చేతులతో అతని ముఖాన్ని ప్రేమగా తడిమి చూసుకున్నాడు. తన చరణాలపై పడిన పుత్రుని వీపును దేవకీదేవి ఆప్యాయంగా నిమిరింది. అందరూ కర్మాధీనులు. మహాకాలుని ద్వారా నిర్ణయింపబడిన కర్మకు బద్ధులై ఉన్నారు.

'కుమారా! నీవు ధర్మజ్ఞుడవు. అన్నీ తెలిసిన వాడవు! వేదకాలంలో ఒక ఋషికి భగవానుడు దీర్ఘాయువును వరదానం చేశాడు కదా! అందరూ నా కన్నుల ముందే దాటిపోతూ ఉంటే చూస్తూ, ఆ దుర్భర వేదనను అనుభవించటానికై ప్రాణావశిష్టుడుగా

ఉన్న ఆ అభాగ్యుడను, విధి వంచితుడను నేనేనా?' అని ఒకే ఒక ప్రశ్న వేశాడు వసుదేవుడు.

'ఏమిటి ఆ వరం తండ్రీ?' కృష్ణుడు తండ్రిని చూస్తూ అడిగాడు. 'నా తరువాత ఉద్భవించిన వారు నా కంటే ముందు గతించకూడదు' ఈ వరమే ఆ ఋషి కోరినది. ప్రారంభం నుండి ఈ వరం నాకు సిద్ధించలేదు. ఇప్పుడు నేను అనుభవిస్తున్న బాధ ఇంతకు ముందెప్పుడూ అనుభవించలేదు కృష్ణా! అన్నాడు వసుదేవుడు. అతని కంఠం రుద్ధం అయింది. కొంచెం శాంతించిన తర్వాత తిరిగి తనయుని తన చేతుల్లోకి తీసుకొని అతని మూర్ధమును చివరిసారిగా ముద్దు పెట్టుకుని తను కళ్ళు మూసుకున్నాడు. ఒక నిముషం తరువాత కళ్ళు తెరిచాడు. అక్కడ కృష్ణుడు లేడు....

అర్జునుడు వసుదేవుని మందిరంలో ప్రవేశించాడు. వసుదేవుని దృష్టి ద్వారం వైపే ఉన్నది. దారుకుడు హస్తినాపురం వెళ్ళిన దగ్గరనుంచి దేవకీ వసుదేవులు తమ ఇంట్లో తామే స్వచ్ఛందంగా కారాగారవాసం చేస్తున్నారు. వసుదేవుడు అర్జునుడి రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు. 'తండ్రీ! అర్జునుడు ఇక్కడికి వస్తాడు. మీరు అర్జునుడిలోనే కృష్ణుణ్ణి చూసుకోండి' కృష్ణుడు వెళ్ళేముందు వసుదేవుడికి చెప్పిన చివరి మాటలివి.

వసుదేవుడు, దేవకి ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. అర్జునుడు ద్వారంలో అడుగు పెట్టి సందేహిస్తూ అక్కడే ఆగిపోయాడు. చూపులు స్తంభించిపోయాయి. అతడు తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు. వార్ధక్యం ప్రతివారికి ఏదో ఒక రోజు తప్పక వస్తుంది అని తనకు బాగా తెలిసిన సంగతే. ఆ మాటకొస్తే తనకీ వృద్ధాప్యం వచ్చేసింది. కృష్ణుడికి కూడ యౌవనం అనే దశ వెనకబడింది. కాని వీరి అవస్థ! మరీ అంత దుర్భరమైన వృద్ధాప్యమా... వారి రోమ రోమంలో వృద్ధాప్యం నేనున్నాను అన్నట్లు ప్రత్యక్షం అవుతున్నది. ఇలా వారిని చూడటం ఎంతో బాధాకరంగా ఉంది. ఇంతకుముందు తాను చూసినప్పుడు దేవకీ వసుదేవులు మరీ అంత వృద్ధులుగా లేరు. ఇంత స్వల్ప వ్యవధిలోనే వారు ఇంత వృద్ధులుగా అయ్యారంటే నమ్మశక్యం కాకుండా ఉన్నది. అర్జునుడు ఆలోచనలలోనుండి బయటపడి వర్తమానంలోకి వచ్చాడు. గబగబ ముందుకు వెళ్ళి దేవకి వసుదేవుల పాదాలపై వ్రాలాడు. 'తండ్రీ!...' అని మాత్రమే అనగలిగాడు. అర్జునుడికి కంఠం రుద్ధమైంది. గొంతు పూడుకొనిపోయి మాట బయటకి రాలేదు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 51: అనిర్వచనీయం ప్రేమ స్వరూపం**

తాత్పర్యము: పరమ ప్రేమ స్వరూపము అనిర్వచనీయమైనది.

ఈ సూత్రముతో మొదలుకొని భక్తి సూత్రములలో నాలుగవ అధ్యాయము ప్రారంభమవుతుంది. ఈ అధ్యాయములో నారదులు పరమ ప్రేమ స్వరూపమైన భక్తి లక్షణాలను వివరిస్తారు. అంతర్గతంగా కొన్ని సూత్రాలలో మనకు భక్తుని లక్షణాలు కూడా కనిపిస్తాయి.



ఈ సూత్రము ప్రేమ స్వరూపము అనిర్వచనీయమైనదని తెలియచేస్తోంది. అంటే వర్ణనకు అంతు చిక్కనిదని అర్థం. ఏదైనా నిర్వచించడానికి అది ఇంద్రియాలకు అందుబాటులో వుండాలి, మరియు నిర్దిష్టముగా ఇది అని చెప్పగలగాలి. పరమ ప్రేమ స్వరూపమైన పరాభక్తి ఆ రెండింటికీ అందదు. ప్రేమను పరమాత్మ స్వరూపముతో పోల్చారు. ఆ బ్రహ్మమును వాక్కుతో వర్ణింపలేక వేదములు కూడా "నేతి నేతి" అంటూ ఇది కాదని మాత్రమే చెప్పగలమని తెలిపాయి. అదే విధంగా పరమ ప్రేమ స్వరూపమైన భక్తిని ఇదమిత్థంగా ఇది అని నిర్వచించడం అసాధ్యమని ఈ సూత్రం తెలుపుతోంది.

బాహ్య పరంగా ఏదైనా ప్రియమైన వస్తువు ప్రాప్తించి మనసు ఆనందములో మునిగిపోయినపుడు ఆ ఆనందమును వాక్కు రూపములో వర్ణింపలేమే! అటువంటిది పరాభక్తిని నిర్వచించడం అసాధ్యము. అంతేకాక ఆ పరాభక్తితో మనసు నిండిపోయినపుడు మాట రావడానికి కూడా వీలుండదు. నీటిపై తేలుతున్న వాడు ఏదైనా పలుకగలడు. అదే నీటిలో పూర్తిగా మునిగిన వానికి పలకడానికి ఆస్కారం వుండదు కదా. అదే విధంగా పరమ ప్రేమ అనుభవైక వేద్యమైనది మాత్రమే అనీ, బాహ్య స్వరూపమునకూ వర్ణనకూ అందనిదనీ నారదుల వారు ఈ సూత్రం ద్వారా తెలియచేస్తున్నారు.

**భక్తి సూత్రము 52: మూకాస్వాదనవత్**

తాత్పర్యము: మూగవాడు రుచి చూచుట వలే (పరా భక్తి వర్ణనాతీతము)

పరాభక్తి అనిర్వచనీయమైనదని ముందు సూత్రములో ప్రతిపాదించిన విషయమును ఈ సూత్రములో ఉదాహరణతో నారదులు వివరిస్తున్నారు. మూగవాడు

ఒక మధుర పదార్ధమును సేవించినపుడు ఎలా వున్నదని ప్రశ్నిస్తే ఏమని బదులు చెప్పగలడు? అలా అని అక్కడ అనుభూతి లేదనలేము కదా. ఉన్న అనుభవమును వర్ణించడానికి మాటలు లేవు. అటువంటిదే పరాభక్తి యొక్క పరమ ప్రేమ అని నారదులు సెలవిస్తున్నారు.

ఇదే విషయాన్ని శ్రీ బాబూజీ మహారాజ్ వారు వివరిస్తూ పటిక బెల్లం రుచి చూసిన వాడిని ఆ తీపి గురించి వివరించమంటే ఏమని చెప్పగలడు? అది కేవలం అనుభవించి ఆస్వాదించవలసినదే అంటూ భగవదనుభూతి కూడా అటువంటిదే అని తెలిపారు.

పరాభక్తి మాటలకు అందదని తెలుపుతున్న ఈ సూత్రం అది మన పంచేంద్రియాలకే కాక పంచ తన్మాత్రలకు కూడా అతీతమని తెలియచేస్తోంది. అంతేకాక ఈ సూత్రం పరాభక్తి కలిగిన సాధకుడి స్థితిని కూడా తెలుపుతోంది. అటువంటి భక్తులు తన్మయత్వంతో తమ తనువునీ మనసునీ మైమరచి తాదాత్మ్యంతో వుంటారు. రాధమ్మ తన్మయత్వము మరియూ గోపికల పరమ ప్రేమయే దీనికి గొప్ప నిదర్శనం.

**భక్తి సూత్రము 53: ప్రకాశతే క్వాపి పాత్రే**

తాత్పర్యము: యోగ్యుడు, పాత్రులైన వారి యందే ఆ పరమ ప్రేమ ప్రకటితమవుతుంది.

అయితే అనిర్వచనీయమైన ఆ పరాభక్తి అసాధ్యమేమో అన్న అనుమానమును నారదులు ఈ సూత్రం ద్వారా నివృత్తి చేస్తూ పరాభక్తి సాధ్యమేననీ కానీ కేవలం పాత్రత వున్న వారిలోనే ప్రకాశిస్తుందని తెలియచేస్తున్నారు. భగవాన్ అన్న శబ్దమునకు మూలాధారమైన “భ” లేక “ప్రకాశము”ను అనుసంధానిస్తూ పరాభక్తి యొక్క ప్రకాశము భగవంతునిదే అని ఈ సూత్రం తెలుపుతోంది. అంతేకాక అటువంటి పాత్రతను పొందాలన్న లక్ష్యమును కూడా సాధకుల ఎదుట నిలుపుతోంది. “ప్రకాశతే క్వాపి పాత్రే” అన్న ఈ సూత్రములో మరో అర్థం కూడా దాగి వుంది. పాత్రత కలిగిన వారిలో పరాభక్తి ప్రకాశించడమే కాక వారిలో అరుదైన మహాపురుషుల ద్వారా ఆ ప్రేమ ఇతరులకు కూడా ప్రకటితమవుతుందని ఈ సూత్రము యొక్క మరొక భావము. మహాత్ములైన సద్గురు దేవుల ప్రేమయే భగవంతుని ప్రేమకు తార్కాణమని ఈ సూత్రములోని అంతరార్థము.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జనవరి 2026**

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 శని: పుష్య పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

7 బుధ: పుష్య బహుళ పంచమి – శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

13 మంగళ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

14 బుధ: భోగి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

15 గురు: సంక్రాంతి పండుగ – ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శుక్ర; కనుమ పండగ

17 శని : మాసశివరాత్రి

18 ఆది: అమావాస్య

23 శుక్ర; మాఘ శుద్ధ పంచమి – వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ,

25 ఆది: మాఘ శుద్ధ సప్తమి – రథసప్తమి

29 గురు: మాఘ శుద్ధ ఏకాదశి – భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

31 శని: శని త్రయోదశి

**ఫిబ్రవరి 2026**

1 ఆది: మాఘ పూర్ణిమ. – గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

15 ఆది: మహాశివరాత్రి – తె.జా.3.30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనములో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5.00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయములో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.11.00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణ మహోత్సవం.

16 సోమ: ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. రాత్రి 7. గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి నగరోత్సవం.

17 మంగళ: అమావాస్య

20 శుక్ర; ఫాల్గుణ శుద్ధ తదియ – శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం.

# వర్క్ ఫ్రమ్ ఓం

- పెనుమాక నాగేశ్వర రావు

హోంలో ఓం ఉంటుంది కానీ ఓంలో హోం ఉండదు. (H)OME, OME ఉచ్చారణ దోషాలు ఉండకూడదు. స్పష్టంగా పలకాలి అని పెద్దలు చెప్పిన మాట గుర్తుకు తెచ్చుకుని అందరం కలసి ప్రణవనాదం చేద్దాం అనగానే గుంపులో గోవిందుడొకడు బిగ్గరగా హోం అని పలికాడట కళ్ళు మూసుకుని. అతని గంభీరమైన కంఠ స్వరానికి ఉలిక్కిపడిన కొందరు చెవులు మూసుకున్నారట. ఖిన్నులయిన కొందరు నోరు మూసుకున్నారట పాపం!

వర్క్ ఫ్రం ఓం అంటే నా ఉద్దేశ్యం ఏమిటంటే......మనం చదువునే ఓంతో మొదలుపెడతాం కదా. ఓం నమశ్శివాయ (ఓ న మా లు ) అంటే ఏ పనినైనా ఓంకారంతో మొదలుపెడితే శుభం కలుగుతుందనే భావాన్ని ఈ ఆధునిక కాలానికి సరిపడా ఇలా వర్క్ ఫ్రం ఓం అని చెబుతున్నానన్నమాట. ప్రణవాన్ని పలుకుతుంటే కలిగే పరవశం, లేదా ఓంకారం వింటుంటే కలిగే ఆనందమే భగవంతుడు అనుకుంటే ఆశ్చర్యం ఏముంటుంది.

భాష తెలియకపోయినా పరవశింపచేసేది సంగీతం. సంగీతానికి ఉన్న శక్తి అది. మనకి పాడటం రాకపోవచ్చు. ఎవరో పాడుతున్నా మనం పరవశానికి లోనవుతుంటాం. ఆ పరవశమే భగవంతుడు. రాగమందనురాగమొలికి రక్తియై సాగును గానం.......... జీవమై సాగును గానం.... మది చింత బాపును గానం అన్నారు కవులు. ఓంకారనాదం ఎక్కువగా పరమేశ్వరునికే అన్వయమవుతుంటుంది. అందుకేనేమో ఓంకారనాదానుసంధానమౌ గానమే శంకరాభరణము అని కూడా పాటలు స్వరపరిచారు.

భాష తెలిస్తేనే సంతోషాన్ని కలిగించేది సాహిత్యం. అక్షర జ్ఞానమే లేకపోతే సాహిత్యం లోని ఆనందాన్ని ఆస్వాదించలేము. స్వరజ్ఞానము లేకపోయినా సంగీతం మనకి ఆనందాన్ని ఇస్తుంది. ఏ జ్ఞానమూ లేకపోయినా ఓంకారం మనకి పరవశాన్ని కలిగిస్తుంది. అది ఓం కారము యొక్క గొప్పతనం. సాహిత్యాభిలాష లేనివారు వుంటారేమో కానీ సంగీతాభిలాష లేనివారు ఉండరనే చెప్పాలి.

నిశ్శబ్దంలో ప్రశాంతత దొరకుతుందనేది మనకు అనుభవమే. అలాగే శబ్దానికి ఆధారం ఓంకారం. లయబద్ధంగా వినిపించే ఓంకారం మనకి ఓ రకమైన పులకింతనిస్తుంది అనేది కూడా మనకి అనుభవమే. ఓంకారనాదం మన ఆరోగ్య రహస్యం అని కూడా పెద్దల మాట. ఓంకారం దివ్యౌషధము అనేది శాస్త్రజ్ఞులుకూడా చెబుతున్న మాట.

భగవంతునికి పూజ చేసేటప్పుడు నామాలు చదవటం మనకు అనుభవంలోని  విషయమే. ప్రతి నామం ముందు ‘ఓం’ చేర్చి నామం చదువుతాము. ఓం జత కూడని నామం శిరస్సు లేని మొండెం లాంటిది అని వర్ణించారు విజ్ఞులు. మనకందరికీ ఇంటి పేర్లు ఉంటాయి కదా మరి దేవుళ్ళకి ఒంటిపేర్లే కానీ, ఇంటిపేర్లు ఎందుకుండవని కొంటెగా ప్రశ్నించిన వ్యక్తికి దేవుళ్ళందరి ఇంటి పేరూ ‘ఓం’ అని చమత్కారంగానే బదులిచ్చాడు ఓ భక్తుడు. అందుకేనా ఓం రామాయ, ఓం కృష్ణాయ, ఓం శివాయ అనుకుంటాం అని స్వగతంలో అనుకున్నాడు ఆ ప్రశ్న అడిగిన వ్యక్తి.

ఓంకారనాదంతో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు దూరమవుతాయని, ఏకాగ్రత పెరుగుతుందని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటారు. అందుకు కారణం ఈ నాదం వల్ల మన శరీరం లోని చక్రాలు ఉత్తేజితమయ్యి, మన అంతరంగాన్ని శుద్ధి చేయటం జరుగుతుందని చెబుతారు. ఈ పవిత్ర శబ్దం విశ్వనాదంతో కలసి కొత్త శక్తిని సృష్టిస్తుందని వారు వెలిబుచ్చిన అభిప్రాయం .

అకార, ఉకార, మకార శబ్దములతో ఏర్పడింది ఓంకారం. ఓంకారం శబ్దాలలో మొదటిది. పరమాత్మకు శబ్దరూప ప్రతీక ఓంకారం. **ఓం ఇత్యేకాక్షరమ్ బ్రహ్మ** అని కదా చెప్పారు. అందుకనే వర్క్ ఫ్రం హోమయినా, వర్క్ ఫ్రం ఆఫీసయినా, వర్క్ ఫ్రం వెహికిల్ అయినా, ఏ పనైనా ఓంకారం నుంచి ఆరంభిస్తే అంతా సాకారం అవుతుంది. సార్థకం అవుతుంది. అందుకే అందరం వర్క్ ఫ్రం ఓంని ఆచరిద్దాం, అనుసరిద్దాం. విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం... ఓం... ప్రాణ నాడులకు స్పందననొసగిన ఆది ప్రణవనాదం... ఓం... ఓం బాబు. ఓం గురురామ్ నమస్తే.

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

(గత సంచిక తరువాయి) - జి. విజయకృష్ణ (బుజ్జి)

ఉన్నత స్థాయి గాడ్జెట్‌ను ఉంచాలని వైద్యులు అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. ఈ కాలంలో, పరిస్థితిని నిర్వహించడానికి శారీరక, నైతిక మరియు లాజిస్టికల్ మద్దతు అవసరమయ్యి నా భార్య, పూణేలో తన భర్తతో నివసిస్తున్న నా కుమార్తె నుండి సహాయం కోరింది. తనకు తోడుగా ఆమెను వెంటనే ఇంటికి రమ్మని కోరింది. దానికి ఆమె వెంటనే అంగీకరించి అందుబాటులో ఉన్న మొదటి విమానంలో వైజాగ్ చేరింది.

మే 21, 2025: ఈ శస్త్రచికిత్స తర్వాత, ఒక రోజు ఆసుపత్రిలో కోలుకున్న తర్వాత, మే 12న అడ్మిట్ చేయబడిన తర్వాత నేను మే 21న ఇంటికి డిశ్చార్జ్ అయ్యాను. ఆ తర్వాత ఒక రోజు ఎటువంటి సమస్యలు లేకుండా జరిగిపోయింది. మే 23, 2025: నేను అసౌకర్యంగా ఉన్నానని ఫిర్యాదు చేశాను. మళ్ళీ అత్యవసర విభాగానికి తరలించారు, అక్కడ అడ్మిషన్ మరియు రొటీన్ తనిఖీలు అన్నీ బాగానే ఉన్నాయని ప్రకటించి, పగటిపూట OPD లోని కార్డియో స్పెషలిస్ట్‌కు నివేదించడానికి నన్ను ఇంటికి తిరిగి పంపారు. మేము OPDకి వెళ్ళాము మరియు స్పెషలిస్ట్ కూడా చూశారు, అంతా సాధారణమేనని, ICD అమర్చిన తర్వాత అలాంటి అసౌకర్యం సాధారణమని ప్రకటించారు.

ఆ రోజు ఆసుపత్రి నుండి తిరిగి వచ్చిన తర్వాత, డైనింగ్ టేబుల్ వద్ద భోజనం చేస్తున్నప్పుడు, పరికరం నాకు వినాశకరమైన షాక్ ఇచ్చినందున నేను సహాయం కోసం అరిచాను. నా కుటుంబం భయాందోళనకు గురై మళ్ళీ నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లింది, అక్కడ ICU లో చేరినప్పుడు వారు దానిని VT/VF తుఫానుగా నిర్ధారించి సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. మళ్ళీ అది సాధారణంగా కనిపించినప్పుడు, మరుసటి రోజు ఇంటికి పంపడానికి నన్ను ICU నుండి గదికి తరలించారు.

మే 26 2025: ఈ రోజు అర్ధరాత్రి తర్వాత నాకు అనేక షాక్‌లు రావడం ప్రారంభించి నరకం మొదలైంది. సిబ్బంది మరియు డ్యూటీ డాక్టర్, సహజంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పట్టించుకోలేదు, నా అటెండెంట్ గొడవ సృష్టించే వరకు. నాలుగు గంటల పాటు నాకు షాక్‌లు తగిలిన తర్వాత డ్యూటీ డాక్టర్ వచ్చి కార్డియాలజిస్ట్‌ను వెంటనే సంప్రదించమని కోరారు. కార్డియాలజిస్టుల బృందం VT/VF తుఫానులను నియంత్రించడానికి తమ శక్తి మేరకు చేయగలిగింది. ఇరవై ఎనిమిది

గంటల పాటు ఎటువంటి విరామం లేకుండా కష్టకాలం గడిచిన తర్వాత, వైద్యులు చివరకు నిస్సహాయతను వ్యక్తం చేశారు.  నన్ను వెంటనే హైదరాబాద్‌కు మెరుగైన సౌకర్యాలతో కూడిన సంస్థకు మార్చాలని మరియు ఎయిర్ అంబులెన్స్ ద్వారా తీసుకు వెళ్ళాలని సిఫార్సు చేశారు.

మే 27,2025: తక్షణ ఎయిర్ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, వైజాగ్‌లో నిస్సహాయ పరిస్థితిలో ఉన్నందున నా కుటుంబం నన్ను రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించుకుంది. నేను మత్తులో ఉన్నాను, పక్షవాతం వచ్చింది, ఇంట్యూబేట్ చేయబడింది మరియు వెంటిలేషన్ చేయబడింది మరియు ఒక వైద్యుడు మరియు ఒక టెక్నీషియన్‌తో కలిసి రోడ్డు మార్గంలో లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు బయలుదేరాను. నా అల్లుడు మరియు మేనల్లుడు నా వ్యక్తిగత సహాయకులుగా ఉన్నారు.

నేను ఆసుపత్రికి చేరుకునే సమయానికి అందుబాటులో ఉండటానికి నా భార్య నా కుటుంబ స్నేహితుడితో కలిసి విమానంలో హైదరాబాద్ బయలుదేరింది, నా కుమార్తె మరియు కుటుంబ సభ్యులు కారులో నన్ను అనుసరించారు. మేము హైదరాబాద్ శివార్లకు చేరుకునే వరకు ప్రయాణం సజావుగా సాగింది, అక్కడ నాకు మళ్ళీ అనేక షాక్‌లు రావడం ప్రారంభమైంది. మార్గమధ్యంలో నా మొదటి గుండెపోటు వచ్చింది. సహాయక బృందం నన్ను బతికించడానికి వెంటనే CPR ఇచ్చింది. తీవ్రమైన అత్యవసర పరిస్థితిలో వైద్య సహాయం అందుబాటులో ఉండే నగరం గుండా నన్ను తీసుకెళ్లాలా లేదా ట్రాఫిక్ కారణంగా ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి ఔటర్ రింగ్ రోడ్డుపై నన్ను తీసుకెళ్లాలా అని వారు నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. ORR ద్వారా ప్రయాణం చాలా తక్కువగా ఉంటుంది కానీ మార్గమధ్యలో ఎటువంటి వైద్య సహాయం దొరకకపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది.

వారి సమిష్టి జ్ఞానం ప్రకారం, వారు ప్రమాదకర మార్గాన్నే ఎంచుకొని, నిర్దేశించిన ఆసుపత్రికి వేగంగా చేరుకోవడానికి ఔటర్ రింగ్ రోడ్డును తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. మార్గమధ్యంలో, నాకు మరో 2 గుండెపోటులు వచ్చాయి.  CPR చికిత్స అందించారు. మే 28న నిర్జనమైన ఔటర్ రింగ్ రోడ్డులో తెల్లవారుజామున, నా పరిస్థితి క్షణక్షణానికి దిగజారుతుండగా, డ్రైవర్ బ్రేక్ నెక్ స్పీడ్‌లో కారును నడిపాడు. గడిచే ప్రతి నిమిషం అంబులెన్స్‌లో భయాందోళన వర్ణనాతీతంగా ఉంది.  చివరికి నేను ఆసుపత్రికి చేరుకున్నాను, అంబులెన్స్‌లోని ఎవరి ముఖంలో రక్తపు చుక్క లేదు.

- సశేషం

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

**"రాజా దశరథోనామ రథ కుంజర వాజిమాన్...,"**

ఆతని మాటలనాలకించిన సీత, 'సముద్ర మధ్యమున గల ఈ లంకా నగరమందు మా మామగారిని గూర్చిఏదో వివరణ వినిపించుచున్నదే' అనిచుట్టూరా కలయజూచింది. 'అమ్మ ఆత్మహత్య ప్రయత్నమును కాస్సేపు ఆపి, విరమించి నా మాటలను ఆలకిస్తుంది' అని నిశ్చయించుకుని హనుమంతుడు మరల మాట్లాడడం కొనసాగించాడు.

"బలముతో నిండియున్నవి, మహా పెద్దవి అయిన రథ, గజ, తురగ, అశ్వములతో కూడిన సేనలుగల దశరథ మహారాజుయొక్క సుపుత్రుడు రాముడు తన తండ్రికి ఇచ్చిన మాట నిలబెట్టుకొనుట కొరకు మకుటాభిషేకమును త్యజించి, ఇల్లాలు సీత మరియు సహోదరుడు లక్ష్మణునితో పంచవటిలో వనవాసం చేయుచున్నాడు. అప్పుడు లంకానగర రాజు రావణుడు వంచనతో సీతను అపహరించి ఇచ్చట బంధించి యుంచాడు. ఈ వివరములనన్నింటినీ రాముడు, తన తండ్రి దశరథుని స్నేహితుడైన జటాయు అనబడు పక్షి ద్వారా తెలుసుకుని, శబరియొక్క అశీర్వాదముతో, తనవలే భార్యకు దూరమై జీవించుచున్న వానర నాయకుడైన సుగ్రీవుని స్నేహమును పొంది, ఆతని అన్నయైన వాలిని సంహరించి, సుగ్రీవుని కిష్కింధకు రాజుగ పట్టాభిషిక్తుని గావించి, ఆతని భార్యయైన రుమను అప్పగించాడు. సుగ్రీవుని ఆనతి మేరకు వానర వీరులంతా నాల్గు దిక్కులకూ వెడలి అమ్మ సీతను వెదకుచున్నారు. దక్షిణ దిక్కున వెదకుటకు హనుమంతుడు అను నామముగల నేను నియమించబడ్డాను. శ్రీరాముని అనుగ్రహముచే నేను సముద్రము దాటి ఇక్కడకు వచ్చి ఆ శీలవతిని చూచేను" అని పలికిన ఆతడు తన మాటలను నిలిపివేయగనే, నాల్గు దిక్కులా చూసిన సీతకు ఆ చెట్టుపై కూర్చునియున్న హనుమంతుడు కనిపించాడు. 'ఇది కలయా! నిజమా!?' యని తలచి, 'స్వప్నములో వానరుని గనుక చూచినట్లైతే అశుభశకునం అంటారే' యని స్వగతమున అనుకుని కాస్తంత కలతచెందింది. 'కాదు...కాదు...ఇది కల కాదు. ఇదిగో ఆ వానరుడు చెట్టునుండి క్రిందకు దిగుచున్నాడే! ఒకవేళ ఇది ఆ రాక్షసుల మాయాజాలమా!?' అనుకుని భయమొందింది.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**జనవరి 2026**

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 శని: పుష్య పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 మంగళ: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

14 బుధ: భోగి పండుగ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 గురు: సంక్రాంతి పండుగ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

23 శుక్ర; మాఘ శుద్ధ (వసంత) పంచమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 ఆది: మాఘ శుద్ధ (రథ) సప్తమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

29 గురు: మాఘ శుద్ధ (భీష్మ) ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**ఫిబ్రవరి 2026**

1 ఆది: మాఘ పూర్ణిమ. – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 బుధ: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 ఆది: మహాశివరాత్రి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గురుసేవాగయా ప్రోక్తా దేహస్స్యా దక్ష యోవటః**
**తత్పాదం విష్ణు పాదంస్యాత్, తత్రదత్త మనస్తతమ్ 38**

**పదవిభాగము** :-
గురుసేవా-గయా-ప్రోక్తా-దేహః-స్యాత్-అక్షయః-వటః-తత్పాదం-విష్ణుపాదం-స్యాత్-తత్ర-దత్త-మనః-తతమ్.

**టీక** :- గురుసేవా=గురువును సేవించుకొనే క్షేత్రమే; గయా=గయాక్షేత్రము అని; ప్రోక్తా=చెప్పబడినది; దేహః=గురుదేవుని శరీరమే; అక్షయ=అక్షయమని పేరుగల; వటః=వట వృక్షము; స్యాత్=అవుతుంది; తత్పాదం=ఆ గురుదేవుని పాదవే; విష్ణుపాదం=విష్ణు పాదముగా; స్యాత్=అవుతుంది; తత్ర=అచ్చట (ఆ గురుదేవుని యందు) దత్తమనః=అర్పణము చేయబడిన మనస్సు; తతం=విష్ణుపాదముగా అవుతుంది; అనగా సర్వ వ్యాపకత్వమును పొందుతుంది.

**వ్యాఖ్య** :- "గురుదేవులు నివసించిన స్థలమే గయా క్షేత్రము, ఆయన దేహమే అక్షయ వట వృక్షము ఆయన పాదమే విష్ణుపాదము, ఆయనకు సమర్పించిన మనస్సే విష్ణుత్వాన్ని (వ్యాపకత్వాన్ని) పొందుతుంది" అని శ్రీగురుదేవుణ్ణి విష్ణు పరంగా వర్ణిస్తున్నాడు పరమేశ్వరుడు. గురుదేవుడు విశ్వేశ్వరుడు అంటే మరొక దైవము కాదేమో అని పొరపాటు అభిప్రాయమునకు వచ్చే అవకాశమున్నది. గురుదేవుడు దేశకాలములకే కాక మతములకు కూడ అతీతుడు, ఆయనే శివుడు, విష్ణువు, బ్రహ్మ, సర్వస్వము ఎందువల్లనంటే తాత్త్వికముగా ఆయన తప్ప మరొక వస్తువే లేని పరబ్రహ్మతత్త్వమే ఆయన. అందువల్ల గురుదేవుడే విష్ణువని, ఆయన దేహం అక్షయవటమని, ఆయన పాదం విష్ణు పదమనీ, ఆయనకర్పించిన మనస్సు కూడ విష్ణుత్వాన్ని పొందుతున్నదనీ ప్రత్యేకముగా స్పష్టంగా తెలియజేయబడుతున్నది.

**గురుమూర్తిం స్మరేన్నిత్యం గురోర్నామ సదాజపేత్**
**గురోరాజ్ఞాం ప్రకుర్వీత గురోరన్య న్న భావయేత్. 39**

**పదవిభాగము** :- గురు-మూర్తిం-స్మరేత్-నిత్యం-గురోః-నామ-సదా-జపేత్-గురోః- అజ్ఞాం-ప్రకుర్వీత-గురోః-అన్యం-న-భావయేత్.

**టీక** :- గురు = గురుదేవుని; మూర్తి = రూపమును; నిత్యం = ఎల్లపుడు; స్మరేత్=స్మరించవలెను, గురోః=గురుదేవుని; నామ=నామమును; సదా=ఎల్లపుడు; జపేత్=జపించవలెను; గురోః=గురుదేవుని; ఆజ్ఞాం=ఆజ్ఞను; ఆదేశమును; ప్రకుర్వీత=చక్కగా నెరవేర్చవలెను; గురోః=గురుదేవునకు; అన్యం=వేరైనదానిని; న

భావయేత్= భావించరాదు; మనస్సులోనికి ప్రవేశించనీయరాదు.

**వ్యాఖ్య** :- "ఎల్లపుడూ గురుదేవుని మూర్తినే ధ్యానించవలెను, గురుదేవుని నామమునే జపించవలెను, గురుదేవుని ఆజ్ఞను చక్కగా నెరవేర్చవలెను, గురువునకు అన్యమైన దానిని ఎప్పుడూ మనస్సులోకి రానీయరాదు". గురువే విష్ణువని, గురువే శివుడనీ ఇంతకు ముందు శ్లోకంలో తెలియజేశాడు, విష్ణు, శివాది సర్వ దైవతములను ఎలా అర్చించవలనో తెలిపే ప్రత్యేక ఆగమ శాస్త్రములున్నవి. కానీ గురుదేవుని ఎలా అర్చించవలెననే ఆగమములేదు. అందుచేత గురు భక్తుడు గురువును ఎలా అర్చించవలెనో ఈ శ్లోకంలో తెలియజేస్తున్నాడు మహేశ్వరుడు. గురువు పరబ్రహ్మ స్వరూపుడు గనుక ఆయన తప్ప వేరొక వస్తువునకు ఉనికిలేదు. "**ఏకమేవ అద్వితీయం బ్రహ్మ నేహ నానాస్తికించన**" అంటున్నవి మహానారాయణ, ఆధ్యాత్మాది ఉనిషత్తులు, అందుచేత గురుదేవునికి అన్యంగా వేరొక వస్తువు లేదని నిశ్చయించుకొని, ఒక వేళ పొరపాటున జగత్తు గుర్తు వచ్చినా అది లేనిదేనని భావించ దానిని మనస్సులోనికి రానీయరాదు. అంతేగాక మానవుడనగా మనో వాక్కాయముల సమాహార స్వరూపమే గనుక, మనస్సుతో గురుస్వరూపాన్ని, వాక్కుతో గురు నామాన్ని, నిరంతరం స్మరిస్తూ, జపిస్తూ గురుదేవుడి ఆజ్ఞలను తన శరీరంతో చక్కగా పాటించే శిష్యుడు తప్పక బ్రహ్మమయుడౌతాడు అంటున్నాడు పరమాత్మ.

విష్ణు శివాదుల అర్చామూర్తులు లింగములు (చిహ్నములు) గనుక మనం కూడ పుష్పాది ద్రవ్యములతో మన భక్తిని వ్యక్తీకరించవచ్చు. తరువాత వారు మనతో మాట్లాడి మనకు ఆజ్ఞలు యివ్వరు, గురుదేవుడు చైతన్యమూర్తి గనుక ఆయనను స్మరించటమూ, జపించటమే ఆయనను సేవించటం, ఆయన ఆజ్ఞలను చక్కగా పాటించటమే సంసార సాగర తరణానికి ముఖ్యోపాయము, గురుమూర్తిని ద్రవ్యాదుల చేత అర్చించుకొన వచ్చునుగాని, అంతకన్నా మనస్సు అర్పణమే ప్రధానార్చనా విధానమని యిక్కడ గురుగీతా శాస్త్రము నిర్దేశిస్తున్నది. అలాగే గురుదేవుడి ఆజ్ఞలను చక్కగా పాటించటమే శిష్యుడు కృతకృత్యుడు కావటానికి ముఖ్యమార్గమని యిక్కడ తెలుపబడింది. "**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**" అన్నాడు కృష్ణపరమాత్మ. గురుసేవకు అడ్డువచ్చే లౌకిక ధర్మాలను కూడ లెక్కచెయ్యక చక్కగా పాటించమని యిక్కడ పరమేశ్వరాదేశం. గురువైన జమదగ్ని ఆదేశంతో తల్లి తల నరికాడు పరశురాముడు, గురువైన నారదుడు ప్రసాదించిన నారాయణోపాసనలో తండ్రిని ఎదిరించాడు ప్రహ్లాదుడు, గురు కార్యనిర్వహణంలో అడ్డు తొలగించుకొనటానికి గోమయ భక్షణ చేశాడు ఉదంకుడు, వీరబ్రహ్మంగారి ఆదేశం మేరకు పుచ్చి పురుగులోడుతున్న కుక్క మాంసం తిన్నాడు సిద్ధయ్య, ఇలా సంపూర్ణ ఆత్మార్పణమే గురుకృపను పొందటానికి సాధనమని తెలియజేస్తున్నాడు పశుపతి.

- సశేషం

# గురుకృప

కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

"నమిన్నవారికి బంగారు పిచ్చుక, నమ్మనివారికి బూడిదే." అన్న మన పూజ్య గురుదేవులు శ్రీబాబు వాక్యాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆ చెదరని విశ్వాసాన్ని చివరిరోజు వరకు నిలుపుకున్న కీ.శే.శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారు ధన్యజీవి!

నరసమ్మగారికి శ్రీబాబు దర్శనం ప్రథమంగా 1945-1947 మధ్య కాలంలో జరిగినది. ఆమె భీమవరంలోని శ్రీ పాలూరి శ్రీరామమూర్తిగారి (భీమవరం తాతయ్యగారు) ఇంటికి ఎదురుగా వుండేవారు. ఆమె, వారి సోదరి సీతామహాలక్ష్మిగారు (శ్రీ వారణాసి అనంత పద్మనాభశాస్త్రి గారి భార్య) శ్రీబాబు యడల భక్తి, శ్రద్ధలు కలిగి ఉండేవారు. శ్రీబాబు తాతయ్యగారి ఇంటికి ఎప్పుడు వచ్చినాకూడా స్వామివారి దర్శనార్థం వీరిద్దరూ వెళ్తూవుండేవారు. శ్రీబాబు దగ్గరకు తమ తండ్రిగారిని (రాయప్రోలు పెద్దనరసింహం గారు) ఎన్ని మార్లు తీసుకుని వెడదాం అన్నా ఆయన "బాబుగారు నాకంటే చిన్నవారు, నేను ఆయనకి నమస్కరించకూడదు" అని దాటవేస్తూ వచ్చేవారు.

ఒకరోజు రాత్రి నరసింహంగారు తమ పెరట్లో భక్తి పాటలు పాడుకుంటూ తన్మయత్వంలో "శంకరా, శంకరా" అని అంటే, తాతయ్య గారి ఇంట్లో ఉన్న శ్రీబాబు లేచి "నన్ను ఆ ఇంట్లో ఉన్న తాతయ్యగారు 'శంకరా' అని పిలుస్తున్నారు ఇంక నాకు నిద్ర ఎలా పడుతుంది" అని అన్నారు.

1952లో యరమిల్లి వేంకటరమణమూర్తిగారితో నరసమ్మగారి వివాహం జరిగింది. అదే సమయంలో శ్రీబాబు బదరి, ఇతర యాత్రలు నుంచి వచ్చి అమీనా సుబ్రహ్మణ్యంగారి ఇంట్లో బస చేసి ఉన్నారు అని, తమ చక్కటి బోధ అందిస్తున్నారు అని తెలుసుకొని ఆమె శ్రీబాబు ఆశీర్వాదం తీసుకుందాం అని వెళ్ళారు. కార్యక్రమం చివరిలో మహా ప్రసాద వితరణ జరుగుతున్నప్పుడు నరసమ్మగారిని చూసిన శ్రీబాబు ప్రసాదం పెట్టబోతూ ఆపి తమ చేతిని వెనక్కి తీసుకుని "పెళ్ళయిందా?!" అని అడిగారు, పక్కనే ఉన్న చెల్లయమ్మగారు "ఈ మధ్యే అయింది బాబు" అని చెప్పగా, దానికి శ్రీబాబు, "అయ్యో, అయిపోయిందా! సర్లే

పాదం పట్టావుగా ఎవరికి తప్పినా నాకు తప్పదు కదా" అని అక్కడ వున్న పదార్థాలు అన్నింటిని కలిపి ఇంకా పెద్ద ముద్ద చేసి "పట్టు" అని మహాప్రసాదం పెట్టారు. ఇదే విషయన్ని ఆవిడ అనుక్షణం, తమ జీవిత పర్యంతం కూడా "శ్రీబాబు నాకు మహాప్రసాదం పెట్టారు, నాకు ఎటువంటి లోటు వుండదు" అని ఎంతో విశ్వాసంగా ఉండేవారు.

1957లో నరసమ్మగారికి ఆడపిల్ల జన్మించింది. ఆ బిడ్డ పుట్టిన 11వ రోజున బిగుసుకుపోయి, ఉదయం నుంచి చలనం లేకుండా ఉండిపోయింది. డాక్టర్ వచ్చి పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చినా కూడా స్పందించకపోయేసరికి, "హోప్ లెస్" అని అన్నారు. అప్పుడు శ్రీమతి సీతమ్మగారు (భీమవరం తాతయ్యగారి పెద్ద కోడలు) వచ్చి, "శ్రీబాబు దగ్గరకు తీసుకురండి, మా ఇంట్లో ఉన్నారు" అంటే బిడ్డ పిన్ని (శ్రీ వారణాసి అనంత పద్మనాభశాస్త్రి గారి భార్య) "నా గురుదేవులు తప్పక బ్రతికిస్తారు" అనే దృఢ విశ్వాసంతో బిడ్డను తీసుకొని తాతయ్యగారింటికి వెళ్ళారు. అప్పటికే సమయం అర్ధరాత్రి కావస్తోంది. శ్రీబాబు గదిలోంచి వస్తూనే "ఎవరో చంటి పిల్లను తీసుకొని వచ్చినట్టున్నారు?" అని అన్నారు. పాప పిన్ని బిడ్డను శ్రీబాబుకు చూపి "ఉదయం నుంచి పాలు తాగడం లేదు బాబూ, చలనంలేకుండా ఉండిపోయింది" అని అంటే శ్రీబాబు ఆ బిడ్డను చూస్తూ, "ఈ లోకంలోకి వచ్చావా?!" అంటే దానికి సమాధానంగా ఆ బిడ్డ "ఊ" (శ్రీబాబు అలా పలికించారు) అని అన్నది. శ్రీబాబు "సరే ఇంక ఏడు" అన్నారు. ఆ పాప నెమ్మదిగా ఏడుపు మొదలు పెట్టింది. శ్రీబాబు బిడ్డ పిన్నితో "ఏం భయం లేదు, నేను ఉన్నాను, తీసుకువెళ్ళి పాలు పట్టండి." అని మళ్ళీ ఆ బిడ్డకి పునర్జన్మ ప్రసాదించారు.

- సశేషం

## శ్రీ కాళీవనాశ్రమము భాగ్యనగర శాఖలో శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమములు

**22-1-2026 గురువారం నుండి 26-1-2026 సోమవారం వరకు శ్రీమాతాజీ వారి ఆధ్వర్యంలో సత్సంగ సమావేశాలు జరుగును. ఆస్తిక మహాశయులందరికీ ఇదే మా ఆహ్వానము!**

# శ్రీ బాబూజీతో నా అనుభవాలు

(గత సంచిక తరువాయి)

- ఇందుకూరి శర్మిష్ఠ

పెదనింద్రకొలనులో నాన్నగారి దగ్గర ఉన్నప్పుడు ఒక సారి నాకు న్యుమోనియా వచ్చింది. డాక్టరు రాజుగారు ఎన్ని రకాల వైద్యం చేసినా చాలా రోజుల వరకు తగ్గలేదు. నాన్నగారు శివాలయంలో 108 ప్రదక్షిణలు చేశారు. అయినా తగ్గుముఖం పట్టలేదు. డాక్టరు రాజుగారు ఏదో గాలి సోకిందని భావించి, నా దగ్గర కూర్చుని ధ్యానం చేసేవారు. ధ్యానంలో ఒకరోజు కలకత్తాలో ఉన్న బాబూజీ భీమవరం వస్తున్నట్లు స్ఫురణ కలిగింది. డాక్టరు గారు భీమవరం వెళ్ళి స్వామికి విన్నవించి వారిని మా యింటికి తీసుకువచ్చారు. నేను లేవలేని స్థితిలో ఉన్నాను. స్వామి నా దగ్గర కూర్చుని, ఒక కొబ్బరికాయ తెప్పించి, మంత్రించి, నాకు దిగదుడుపు తీయించారు. నాన్నగారిని శివాలయానికి 11 రోజులు ప్రక్షిణలు చెయ్యమని చెప్పి వెళ్ళారు. కొద్ది రోజులకే నాకు జ్వరం తగ్గు ముఖం పట్టింది. తరువాత స్వామి గుంటూరులో ఉన్నారని తెలిసి డాక్టరు గారు, నాన్నగారు కలిసి నన్ను గుంటూరు స్వామి దగ్గరికి తీసుకు వెళ్ళారు. స్వామి నన్ను అక్కడ కొన్ని రోజులు ఉంచి, మందులు యిచ్చి పంపిన తరువాత పూర్తిగా కోలుకున్నాను.

నేను, మా పెద్ద అబ్బాయి ఆనందు ఆశ్రమంలో ఉన్నాము. వాడు పిల్లలతో ఆడుకుంటూ పడిపోయాడు. మిగిలిన పిల్లలు ఇంటికి తీసుకు వచ్చారు. బాగా జ్వరం వచ్చేసింది. హెూమియో మందు వేశాము. చీకటి పడేసరికి జ్వరం ఇంకా ఎక్కువయ్యి వణకటం మొదలు పెట్టాడు. అప్పటికి ఊరు నుంచి వాళ్ళ నాన్న వచ్చారు. మా నాన్న గారు "బాబూజీ బైట కూర్చున్నారు. పిల్లవాడ్ని తీసుకు వెళ్దాము" అని అందరం కలిసి విజ్ఞాన మందిరం మొదటి అంతస్థులో శ్రీ బాబూజీ కూర్చున్న చోటికి ఎత్తుకుని తీసుకుని వెళ్ళాము.

బాబూజీ వాడిని క్రిందకు దింపమన్నారు. 'నిలబడలేక పోతున్నాడు బాబు' అని చెపితే, నా కుర్చీ పట్టుకుని నిలబడతాడు అన్నారు. అలాగే దింపి నుంచో పెట్టాము. శ్రీ బాబూజీ లక్ష్మక్కను గదిలోని నారింజపండు తెమ్మన్నారు. ఆ పండు పిల్లవాడి చేతిలో పెట్టి 'ఇది తిని పడుకో' అని చెప్పారు. 'రేపు ఉదయం నేను లేచేసరికి ఇక్కడకు వచ్చి కూర్చోండి' అని చెప్పారు. మేము మర్నాడు ఉదయమే వెళ్ళి బాబూజీ గది వద్ద కూర్చున్నాము. శ్రీ బాబూజీ బైటకు వస్తూనే 'వచ్చారా' అని, వాడిని 'మీ అమ్మ చంక దిగి నా చెయ్యి పట్టుకో' అని, వాడిని పట్టుకుని మొదటి అంతస్థు నుంచి ఒక్కొక్క మెట్టు దిగుతూ, ఒకటి రెండు అని వాడితో అనిపిస్తూ మొత్తం మెట్లు దింపారు. ఇంక పరవాలేదు, వెళ్ళి పాలు త్రాగి ఆడుకో అని చెప్పారు. అప్పట్లో శ్రీ బాబూజీ రోజూ

కాళీమాత పూజ చేసి అందరికి స్వయంగా తీర్థం యిచ్చేవారు. ఆనందును రోజూ తీసుకు వెళ్ళి తీర్థం ఇప్పించేవారం. ఒక వారం తరువాత వాళ్ళ నాన్న గారు బాబూజీని సెలవు అడిగితే, నువ్వు వెళ్ళు, అమ్మాయిని బాబుని మందు యిచ్చి పంపుతాను అన్నారు. కొన్ని రోజుల తరువాత మందు యిచ్చి పంపించారు. వాడికి అప్పటి నుంచి మరెప్పుడూ జ్వరం రాలేదు.

కొద్ది రోజుల తర్వాత మందు కోసం ఆశ్రమానికి మళ్ళా వచ్చాను. ఆనందు ఎలా ఉన్నాడు అని అడిగి మళ్ళా మందు కలిపించి యిచ్చారు. అవి తీసుకుని తిరిగి ప్రయాణం అయ్యాను. విజయవాడలో తాడేపల్లిగూడెం బస్సు ఎక్కిన తరువాత వాంతులు అయ్యి స్పృహ తప్పిపోయింది. శ్రీ బాబు ఒక అవ్వ రూపంలో వచ్చి, నా తల ఒడిలో పెట్టుకుని తడి రుమాలుతో ముఖం తుడిచారు. ఏలూరు రైల్వే గేటు దగ్గరకు (వట్లూరు) చేరుకున్న తరువాత నన్ను కూర్చోపెట్టి, 'నీ బ్యాగ్ ఇదిగో జాగ్రత్త, మా యిల్లు యిక్కడే' అంటూ బస్సు దిగి చూస్తుండగానే అదృశ్యం అయిపోయారు.

పిల్లల చదువు నిమిత్తం తాడేపల్లిగూడెంలో మకాం పెట్టాము. కార్తీకమాసంలో ప్రక్కింటి ఆవిడ 'కార్తీక సోమవారం కదా కాలువకు వెళ్ళి స్నానం చేసి వద్దాము' అన్నారు. నేను రానని ఎంత చెప్పినా వినకుండా, 'తెల్లవారే లోపు తిరిగి వచ్చేద్దాము, నేను వున్నాను కదా ఇద్దరం కలిసి వెళ్ళి స్నానం చేసి వద్దాము' అని బలవంతముగా తీసుకువెళ్ళారు. కాలవ దగ్గర ఇద్దరం కలిసి మెట్లు దిగుతున్నాము, చివరి మెట్టు దగ్గరకు రాగానే ముందుకు కాలువలో పడి కొట్టుకు పోతున్నాను, ప్రక్కింటావిడ 'వదినగారు ఎక్కడ' అని వెతుక్కుంటున్నారు. నీటిలో మునిగిపోతూ ఉక్కిరి బిక్కిరి అయి 'బాబూ' అని గట్టిగా పిలిచాను, శ్రీ బాబు నన్ను చేయి పుచ్చుకుని తీసుకు వచ్చి గట్టుమీద ఉన్న ఆడవారి మధ్య వదిలి అదృశ్యం అయిపోయారు.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2026 :*** AS 5457, 6483, 8594, 8598, 9203, PK 0109, 0110

***ఫిబ్రవరి 2026 :*** AS 5475, 7233, 8641, 8642, 8643, 9298, 9299, 9300, PK 0111

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ గండికోట వేంకటేశ్వర్లు గారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

వెంకటేశ్వర్లుగారు మద్రాసు వెళ్ళి, బాబు అన్నట్లుగానే , మళ్ళీ మూడో రోజుకు తిరిగి భీమవరం వచ్చారు. దానికి కారణమిది. అప్పుడు ప్రధాన మంత్రి నెహ్రూ అస్వస్థులై ఉన్నారు (1964). వెంకటేశ్వర్లుగారు ముఖ్యమైన కార్యక్రమాన్ని గురించి అర్జంటుగా ఢిల్లీ వెళ్ళ వలసి ఉంది. ఆయన భీమవరంలో ఉన్నందున, ఆఫీసు వాళ్ళు ఆ కాగితాలన్నీ వారి సెలవు అడ్రసుకు భీమవరానికి పంపించారు. వెంకటేశ్వర్లుగారు అటు మద్రాసు వెళ్ళారు. కాగితాలు యిటు భీమవరం వచ్చాయి. ఆఫీసు వాళ్ళు ఆయనను వెంటనే తిరిగి వెళ్ళి ఆ కాగితాలు తీసుకుని అటునుంచి అటే ఢిల్లీ వెళ్ళమని పంపారు.



రాగానే వెంకటేశ్వర్లుగారు శ్రీ బాబు దర్శనానికి వెళ్ళారు. శ్రీ బాబు నవ్వుతూ "మద్రాసు వెళ్ళటానికి, తిరిగి రావటానికి మీరు పడిన యీ అవస్థ తప్పించాలనే ఉద్దేశంతోనే మిమ్మల్ని రెండు రోజులుండమన్నాను. నా మాట విని ఉంటే మీకు శ్రమా తప్పేది. మరి రెండు రోజులపాటు జగన్మాత దర్శన భాగ్యమూ, తీర్థ ప్రసాదములూ దక్కేవి. నేనేది చెప్పినా కారణం లేకుండా చెప్పను. అలా అని విశ్వాసం కలిగిన వారికి తిప్పలుండవు" అన్నారు.

అప్పటి నుంచి వెంకటేశ్వర్లుగారు శ్రీ బాబు యెడల తిరుగు లేని విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. వెంకటేశ్వర్లుగారు నెల్లూరు, బెంగళూరు, ఢిల్లీ మొదలైన ఎన్నో ఊళ్ళలో ఉద్యోగ రీత్యా పని చేసినపుడు, శ్రీ బాబు ఎన్నోసార్లు వారింటికి వెళ్ళేవారు. దంపతులిరువురు శ్రీ బాబును భక్తి ప్రపత్తులతో సేవించుకునే వారు.

బెంగళూరులో వెంకటేశ్వర్లుగారు పనిచేస్తున్న రోజులలో ఒకసారి శ్రీ బాబు బళ్ళారి శాస్త్రిగారు మొదలైన భక్తులతో వాళ్ళింటికి వెళ్ళారు. అక్కడ శ్రీ బాబు, బళ్ళారి శాస్త్రిగారు నివేదన చేసుకొంటూ (భోజనం) భగవత్తత్త్వమును గురించి విచారణ జరుపుతున్నారు. వెంకటేశ్వర్లుగారు వారికి వెనుక వైపున నిలబడి విసురుతున్నారు. శ్రీ బాబు నివేదన చేసుకునే సమయంలో సాధారణంగా ఎవరూ దగ్గర ఉండరు. అందుకని వెంకటేశ్వర్లుగారి ధర్మపత్ని వెంకటేశ్వర్లుగారిని సైగలతో వారించబోయారు. శ్రీ బాబు ఆమె వైపు తీవ్రంగా చూసి నవ్వుతూ 'తప్పుకో'మన్నట్లుగా సైగ చేశారు.

ఆ తరువాత శ్రీబాబు ఆ విషయం వివరిస్తూ "నివేదన చేసుకునే సమయంలో అనవసర ప్రసంగం చేసేవాళ్ళు దగ్గర ఉంటే, వాళ్ళ వలన ప్రశాంతతకు భంగం కలుగుతుందని వద్దంటాను. కాని నేనెప్పుడూ నాన్నగారితో కలిసే నివేదన చేసుకునే వాణ్ణి. వారితో గాని, యిప్పుడిలా మా అన్నగారితో గాని (బళ్ళారి శాస్త్రిగారితో) కూర్చుని నివేదన చేసుకుంటే ,చక్కని తత్త్వ విషయాలు విచారణలోకి వస్తాయి. అప్పుడు జరిగే సంభాషణ, భుజిస్తున్న పదార్థాన్ని అమృతంగా మార్చి మనస్సుకు మరింత ప్రశాంతతను కలిగిస్తుంది. అలాగే మా వెంకటేశ్వర్లు యిప్పుడు నిశ్శబ్దంగా వెనుక నిలబడి గురుసేవ, పెద్దల సేవ చేసుకున్నాడు. అంతే కాదు. ఇప్పుడు అతని మనస్సు కూడా జరిగే తత్త్వ చింతనలో నిమగ్నమైంది. అది ఎంత ఆనందించ వలసిన విషయం! నివేదన సమయంలో అటువంటి వారు ఎందరున్నా సంతోషమే. కాని (వెంకటేశ్వర్లుగారి ధర్మ పత్నిని చూపిస్తూ) నువ్వు యిక్కడే ఉండి కూడా, ఆ ఆనందంలో పాలు పంచుకోకపోగా, మీ ఆయనకు చేతులతో వెళ్ళిపొమ్మని సైగలు చేస్తూ ఆ ప్రశాంతతకు భంగం కలిగించటం వల్ల నిన్ను తప్పుకోమనవలసి వచ్చింది. తత్త్వ విచారణ సమయంలో తన చుట్టుప్రక్కల వాతావరణాన్నీ, సమయాన్నీ, ప్రపంచాన్నీ మరచిపోగలిగినపుడే సార్థకత" అన్నారు.

- సశేషం

***గురువుని కేవలం మానవ మాత్రునిగా భావించరాదు. భగవానుని దివ్యజ్యోతిని సద్గురువులో దర్శించవచ్చు. సద్గురువే భగవంతునిగా దివ్యపరివర్తన చెందటం ఊహాతీతమైన ఒక అద్భుత లీల! లీలా మానుష రూపం దాల్చిన సద్గురువు తనపట్ల అచంచల విశ్వాసం నిలుపుకున్న వాళ్ళకి సకల శుభాలు అనుగ్రహిస్తాడు. మానవునికి భగవంతునికి మధ్యన అనుసంధాన కర్త సద్గురువే!***

- శ్రీ కాళీబాబు

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## భక్త పోతన

భాగవతంలోని పద్య గద్యాలు తెలుగునాట అందరినోట వినిపించినవే. పోతన కవితాధారతో పరిపూరితములైనవే. మచ్చుకు ప్రహ్లాద ఘట్టాన్ని పరిశీలిద్దాం-



"సనకసనందాదుల వలన శాపగ్రస్తులైన జయ, విజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించారు. వరాహస్వామి వలన హిరణ్యాక్షుడు మరణించాడు. హిరణ్యకశిపుడు ఆ క్షణం నుంచి హరిని ద్వేషిస్తూ హరిని కొలిచే వారిని నానా హింసలు పెడుతున్నాడు.

భగవత్సంకల్పం చేత ప్రహ్లాదుడు అతడికి పుత్రుడై జన్మించాడు. ఇతడికి భూతదయ మెండు. పెద్దలయెడ భృత్యుడై మసలేవాడు. స్త్రీల యెడ మాతృభావం కలిగి ఉండేవాడు. దీనుల యెడ ఇతనికి ప్రేమ అపారము, తోటివారి ఎడల సోదర భావము, గురువులను దైవముగా తలచేవాడు. అబద్ధములు ఆడుట తెలియదు. ఇవి మర్యాద జీవన సరళిలో నడచిన ప్రహ్లాదుని సహజ గుణములు.

తల్లి కడుపున ఉన్నపుడే నారదుని ఉపదేశంతో ఇతనికి హరి భక్తి అబ్బింది. ఇతని హరి భక్తిని గురించి పోతన ఇలా వర్ణించాడు.

పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత శ్రీ
మన్నారాయణ పాద పద్మయుగళీ చింతామృతా స్వాదసం
ధానుండై మఱచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా

పానీయాలు త్రాగటం, ఆహారం తీసుకోవటం, భాషించటం మొదలైనవి చేసేటప్పుడే కాక నిద్రావస్థలో కూడా హరి భక్తి ఇతనికి ఉచ్ఛ్వాసనిశ్వాసల వలె విడదీయరానిదైంది.

ప్రహ్లాదుడు భక్తి పూర్వకంగా ప్రభోదాత్మకంగా చేసిన పద్యములు:

1. ఎల్ల శరీర ధారులకు నిల్లనుచీకటి నూతిలోపలన్ ...

2. మందార మకరంద మాధుర్యమునదేలు ...

3. కమలాక్షునర్చించు కరములు కరములు, శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ

ఇటువంటి పద్యాలు సామాన్యులకు కనువిప్పు కలిగించి భక్తి మార్గానికి మరలించేవిగా ఉంటాయి. శ్రీ వారి సర్వ వ్యాపకత్వం గురించి ఈ విధంగా చెప్పాడు.

ఇందు గలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన నందందే గలడు దానవాగ్రణి వింటే!

పోతన మహాకవి చెక్కిన శిల్ప కళా ఖండాలలో ఈ ప్రహ్లాద చరిత్ర ఒక మేలు బంతి. ఈ మహాకవి గూర్చిన గద్యపద్యాలు తెలుగువారి నాలుకలపై నాని నాని వారి గుండెలలో మాగి మాగి రసానుభూతిని కూర్చాయి. అందుకే

ఖ్యాతి గడించుకొన్న కవులెందరు లేరె! అదేమి చిత్రమో
పోతనయన్నచో కుంగి పోవునె డెంద; జోహారు సేతకై
చేతులులేచు, ఈ జన వశీకరణాద్భుత శక్తి చూడగా
నాతని పేరులో గలదో! ఆయన భాగవతాననున్నదో -

అన్నారు కరుణశ్రీగారు.

మహాకవి బమ్మెర పోతనామాత్యులవారు శ్రీ మహా భాగవతాన్ని తెలుగు భాషలో రచించి ఆంధ్రులందరికీ మహోపకారం చేశారు. వారు భగవన్నామ స్మరణలో పరవశించే మహాభక్తులు. లౌకిక ప్రభావాలకు అతీతమైనవారు. శ్రీ కైవల్య పదము చేరుటయే మానవజన్మ సాఫల్యమని తెలియజేసిన తత్త్వజ్ఞులు.

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## నవంబరు 8 నుండి 16 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన శ్రీ సద్గురుదేవుల 37 వ పుణ్యారాధన దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26



నవంబరు 1 నాడు కర్నూలు జిల్లా
కొక్కరచేడు గ్రామంలో జరిగిన
సత్సంగం మరియు
లలితా సహస్రనామ పారాయణ
దృశ్యములు





నవంబరు 5
కార్తీక పౌర్ణమి -
శ్రీ సద్గురు పాదపూజ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.